RNI APTEL/25/A0798

టుడే విదుర

జాతీయ తెలుగు దిన పత్రిక

https://www.todayvidhura.com/

ప్రచురణ: ఆంధ్రప్రదేశ్, తెలంగాణ సంపుటి : 1 సంచిక:68 10-10-2025 శుక్రవారం ఎడిటర్ :మర్రి పవీణ్ పేజీలు : 8 వెల 4 /

# మూడు నెలల్లో మత్స్యకారులు సమస్యల పరిష్కారానికి కృషి




అక్టోబర్ 9(టుడే విదుర) :కాకినాడ మత్స్యకారులు ఎదుర్కొంటున్న సమస్యలపై సమగ్ర పరిశీలన జరిపి మూడు నెలల్లో పుష్కరించడానికి కృషి చేస్తామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ హామీ ఇచ్చారు. గురువారం కలెక్టరేట్ వివేకానంద సమావేశ హాలులో రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఉప్పాడ మత్స్యకారులతో మాట-మంతి కార్యక్రమాన్ని నిర్వహించి మత్స్యకార గ్రామాల పెద్దలు, యువత, మహిళలు, స్వచ్ఛంధ సంస్థలతో ముఖాముఖి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో తొలుత సముద్ర వేటలో ప్రమాదవశాన మరణించిన 18 మంది మత్స్యకారులకు కుటుంబాలకు గ్రూప్ ఏక్సిడెంట్ ఇన్స్యూరెన్స్ క్రింద తొలివిడతగా ఒక్కరికికీ 5 లక్షల చొప్పున రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన 90 లక్షల ఎక్స్ గ్రేషియా మొత్తాల చెక్కులను ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పంపిణీ చేశారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మత్స్యకారుల సమస్యలను సావధానంగా ఆలకించి పరిష్కారంపై రాష్ట్ర, జిల్లా అధికారులతో చర్చించారు. ఉప్పాడ తీరంలో పరిశ్రమల వ్యర్థాలు సముద్ర జలాల్లో కలుస్తున్న అంశంపై ఎన్విరాన్మెంటల్ ఆడిట్ చేయిస్తామన్నారు. ఈ లోగా మూడు రోజుల్లోపు కాలుష్య స్థాయిపై ప్రాథమిక నివేదిక అందజేయాలని రాష్ట్ర పిసిబి మెంబర్-సెక్రటరీని కోరారు. రెండు,మూడు రోజుల్లో మరో మారు వచ్చి సముద్రంలో వ్యర్థాలను వదులుతున్న ప్రదేశాలలో కాలుష్య పరిస్థితిని పరిశీలిస్తానన్నారు. నిర్మాణంలో ఉన్న హార్బరు డిజైన్ లోపాలపై ఐఐటి చెన్నై నిపుణల కమిటీ నివేదక ప్రకారం మత్స్యకార బోట్లకు ముప్పు లేకుండా డిజైన్ కరెక్షన్ చేయిస్తామన్నారు. రాష్ట్ర, దేశాభివద్ధికి పరిశ్రమలు కూడా అవసరమేనని, అయితే ప్రజల జీవనోపాధికి విఘాతం, లోటు లేకుండా సమతౌల్యం పాటిస్తూ ముందుకు సాగాల్సి ఉందన్నారు. సాంప్రదాయ వత్తులను కాపాడుతూనే మత్స్యకార యువతకు స్కిల్ డవలెప్మెంట్ ద్వారా ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. ఉప్పాడ బోట్ల లాండింగ్ అంశంలో అంతర్వేది, మచిలీపట్నం ప్రాంత మత్స్యకారులు, ప్రజాప్రతినిధులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తామన్నారు. ఓఎన్జీసి తరహాలో పరిహారం అందించే అంశం పరిశ్రమలు, మత్స్య, కాలుష్య నియంత్రణ తదితర శాఖలతో ముడివడిన మల్టీ డిపార్టమెంటల్ అంశమని ఆయా శాఖలను సమన్వయపరచి నిర్ణయించాల్సి ఉందన్నారు.

# రతన్ టాటా..

## స్ఫూర్తి ప్రదాత: చంద్రబాబు





అమరావతి, అక్టోబర్ 9(టుడే విదుర): భారతమాత ముద్దుబిడ్డ, దివంగత భారత పారిశ్రామిక వేత్త రతన్ టాటా వర్ధంతి సందర్భంగా ఆయన దేశానికి చేసిన సేవల్ని ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గుర్తు చేసుకున్నారు. సీఎం చంద్రబాబు నాయుడు ఈ ఉదయం తన సోషల్ మీడియా అకౌంట్ 'ఎక్స్' ఖాతాలో చేసిన ఒక పోస్ట్‌లో రతన్ టాటాను స్మరించుకున్నారు.'శ్రీ రతన్ టాటా మృతి చెంది ఏడాదవుతోంది. ఆయన పారిశ్రామిక దిగ్గజం. కరుణామయ మానవతావాది, ఒక దార్శనికుడు, ఆయన వారసత్వం భవిష్యత్ తరాలకు శాశ్వతంగా స్ఫూర్తినిస్తుంది.. యువతకు మార్గనిర్దేశం చేస్తుంది.' అని చంద్రబాబు అన్నారు. తన పోస్ట్ కు రతన్ టాటా ఫొటోను కూడా జత చేశారు చంద్రబాబు.కాగా, రతన్ టాటా (1937-2024)టాటా గ్రూప్‌ను ప్రపంచ స్థాయికి తీసుకెళ్లిన దిగ్గజం. ఆయన అక్టోబర్ 9, 2024 న పరమపదించారు. రతన్ టాటా భారత దేశానికి చేసిన సేవలు, దాతృత్వం, ఆవిష్కరణలు భారత దేశం మొత్తం ఆయన్ను ఎల్లకాలం స్మరించుకునే స్థాయికి తీసుకెళ్లాయి.

# మైనారిటీల్లో వెలుగులు, మార్పులకు కారణం ప్రధాని:

## మంత్రి సత్యకుమార్



విజయవాడ, అక్టోబర్ 9(టుడే విదుర): మైనారిటీ మోర్చాలో బీజేపీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ పార్టీని మరింత బలోపేతం చేశారని మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. గురువారం నాడు బీజేపీ మైనారిటీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులుగా సయ్యద్ భాషా ప్రమాణ స్వీకారోత్సవ సభలో మంత్రి మాట్లాడుతూ... నాలుగు సంవత్సరాలుగా మైనారిటీ రాష్ట్ర అధ్యక్షులుగా బాజీ బీజేపీ పార్టీ సిద్ధాంతాలని ప్రజల్లోకి తీసుకెళ్లారని తెలిపారు. అలాగే సోదరులు సయ్యద్ బాషా కూడా పార్టీలో చురుగ్గా పని చేస్తూ విస్తృత స్థాయిలో పని చేస్తారని ఆశిస్తున్నామన్నారు. గతంలో మైనారిటీ వారి పరిస్థితి ఏవిధంగా ఉండేదో ప్రస్తుతం ఏవిధంగా ఉందో తెలుస్తోందని మంత్రి వెల్లడించారు. మైనారిటీ వర్గాల వారికీ సమాజంలో సమాన ప్రాతినిధ్యం కలిగేలా బీజేపీ కృషి చేసిందని చెప్పుకొచ్చారు.కులం మతం చూడకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతి ఇంటికి కుళాయి నీరుని అందిస్తుందన్నారు. ఆ విధంగా ప్రధాని మోదీ అనేక సంక్షేమ పథకాలను కులం మతం చూడకుండా పేద మధ్య తరగతి ప్రజలకు అండగా నిలుస్తున్నారని తెలిపారు. మైనారిటీ పిల్లల చదువు దగ్గర నుంచి ఉద్యోగాలు, పెళ్లి చేసే వరకు ఇలా అనేక సంక్షేమ పథకాలని మైనారిటీ వర్గాల వారికి ఎన్డీఏ ప్రభుత్వం కలిపిస్తుందని పేర్కొన్నారు.

# జగన్‌పై దళిత సంఘాల ఆగ్రహం.. పర్యటన అడ్డుకుంటామంటూ..



అక్టోబర్ 9(టుడే విదుర) :ఏపీ మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నర్సీపట్నం పర్యటనకు దళిత సంఘాల నుంచి నిరసన సెగ తగిలింది. డాక్టర్ సుధాకర్ కుటుంబానికి జగన్ క్షమాపణలు చెప్పాలని దళిత సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. క్షమాపణలు చెప్పకపోతే జగన్ పర్యటనను అడ్డుకుంటామని వారు హెచ్చరించారు. డాక్టర్ సుధాకర్ కు అవమానం జరిగిందంటూ నర్సీపట్నంలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. మాస్క్ ఇవ్వలేని వాళ్లు..మెడికల్ కాలేజీలపై మాట్లాడటమా అంటూ దళిత సంఘాల నేతలు జగన్ ను ప్రశ్నిస్తున్నారు. మొత్తంగా మాజీ సీఎం జగన్ నర్సీపట్నం పర్యటనపై ఆసక్తి నెలకొంది.ఇక జగన్ నర్సీపట్నం పర్యటన విషయానికి వస్తే... వైసీపీ ప్రభుత్వం నిర్మించిన నర్సీపట్నం మెడికల్ కాలేజీని ఆయన సందర్శించనున్నారు. రాష్ట్రంలో ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటీకరించేందుకు లేదా అమ్మేయడానికి ప్రస్తుత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ జగన్ ఈ పర్యటన చేపట్టినట్లు వైసీపీ వర్గాలు తెలిపాయి.జగన్ పర్యటనకు పోలీసులు కీలక ఆదేశాలు జారీ చేశారు. నర్సీపట్నం నియోజకవర్గంలో మాజీ సీఎం జగన్ పర్యటన సందర్భంగా పార్టీ కార్యకర్తలు ఎట్టి పరిస్థితుల్లోనూ జాతీయ, రాష్ట్ర హైవేలపై గుమిగూడి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించవద్దని జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా కోరారు.

# రాయవరం బాణసంచా పేలుడుపై దర్యాప్తుకు ప్రభుత్వం ఆదేశం



అమరావతి, అక్టోబర్ 9(టుడే విదుర): బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రాయవరంలో బాణసంచా పేలుడుపై దర్యాప్తునకు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. సమగ్ర దర్యాప్తునకు ఉన్నతస్థాయి కమిటీ నియమిస్తూ సర్కార్ ఆదేశాలిచ్చింది. ఈ మేరకు గురువారం నాడు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ ఉత్తర్వులు జారీ చేశారు. మునిసిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్. సురేష్ కుమార్ నేతృత్వంలో దర్యాప్తు కమిటీని నియమించింది. దర్యాప్తు కమిటీ సభ్యుడుగా ఐ.జి. ఆకే రవికృష్ణను నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. రాయవరంలోని బాణ సంచా తయారీ కేంద్రంలో పేలుడికి కారణాలను అన్వేషించాలని ఆదేశాల్లో వెల్లడించింది. దుర్ఘటనకు బాధ్యులు ఎవరో తేల్చాలని తెలిపింది. ఈ తరహా ఘటనలు జరగకుండా నివారణ చర్యలు సిఫార్సు చేయాలని ఆదేశించింది. వారంలోగా అధ్యయన నివేదికను ప్రభుత్వానికి సమర్పించాలని ఆదేశాల్లో పేర్కొంది. విచారణ కమిటీకి సహకరించాలని కోనసీమ జిల్లా కలెక్టర్, ఎస్పీకి ప్రభుత్వం ఆదేశించింది.

# గుడ్ న్యూస్.. భారీగా పోలీస్ ఉద్యోగాలకు త్వరలో నోటిఫికేషన్..!

అమరావతి(టుడే విదుర): ఆంధ్రప్రదేశ్‌లోని నిరుద్యోగులకు పోలీస్ శాఖ త్వరలోనే శుభవార్త అందించనున్నట్లు తెలుస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న ఉద్యోగాలను పోలీసు శాఖ భర్తీకి కసరత్తు చేస్తోంది. వివిధ డిపార్ట్‌మెంట్‌లలో అంటే సివిల్, ఆర్మ్‌డ్ రిజర్వు, స్పెషల్ ఆర్మ్‌డ్ రిజర్వు, ఏపీఎస్పీ, సీపీఎల్, పీటీఓ, కమ్యూనికేషన్స్‌లో ఉన్న ఉద్యోగ ఖాళీలను పూర్తి చేసేందుకు నిమగ్నమంది. ఈ మేరకు ఇందుకు సంబంధించిన వివరాలను రాష్ట్ర సర్కారుకు డీజీపీ పంపించారు. ప్రభుత్వం పూర్తి స్థాయిలో పరిశీలించి అనుమతి ఇవ్వగానే ఉద్యోగ భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేయనుంది.అయితే డీజీపీ కార్యాలయం రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తూ.. పంపించిన లేఖలో ఉద్యోగ ఖాళీలను ప్రస్తావించింది. సివిల్ పోలీస్ ఫోర్స్‌లో 315 ఎస్సైలు, 3580 సివిల్ కానిస్టేబుల్, 96 ఆర్ఎస్ఐ పోస్టులు, 2520 ఏపీఎస్పీ కానిస్టేబుళ్ల భర్తీకి అనుమతించాలని కోరింది.

# త్వరలోనే ఆర్డీటీపై పాజిటివ్ వార్త: మంత్రి పయ్యావుల



అనంతపురం, అక్టోబర్ 9(టుడే విదుర): జీఎస్టీ తగ్గింపు ఫలాలు సామాన్యులకు చేరాలని జీఎస్టీపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. గురువారం నాడు సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్‌పై అవగాహన సదస్సులో మంత్రి మాట్లాడుతూ.. పేదలకు ఉపయోగపడే అన్ని రకాల వస్తువులపై జీఎస్టీ తగ్గించామని తెలిపారు. దీని ద్వారా ప్రతి కుటుంబానికి రూ.18 వేలు నుంచి 20 వేలు ఆదా అవుతోందన్నారు. రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని చెప్పారు. ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్ఏ అనుమతిపై ముఖ్యమంత్రి చంద్రబాబు స్వయంగా మాట్లాడారని మంత్రి తెలిపారు. ఇటీవల జరిగిన సమావేశంలో చంద్రబాబు ఈ అంశంపై కేంద్రమంత్రి అమిత్ షా తో మాట్లాడారని.. పేదలకు మంచి చేస్తున్న ఆర్డీటీ గురించి త్వరలో మంచి వార్త వింటారని చెప్పారు.జగన్ మోహన్ రెడ్డి చీప్ రాజకీయాలు మానుకోవాలని హితవు పలికారు. మెరుగైన సేవలు కోసమే పీపీపీ మోడల్ అని స్పష్టం చేవారు. ప్రపంచం ఓ వైపు పోతుంటే జగన్.. ఏపీని వెనక్కి లాగాలని చూస్తున్నారని విమర్శించారు.

# సంపాదకీయం

## ప్రజాస్వామ్య భరోసానివ్వని బిహార్ సర్

బిహార్ ఓటర్ల తుది జాబితాలు వెలువడ్డాయి. అసెంబ్లీ ఎన్నికల తేదీలూ ప్రకటించారు. పూర్తయిన ఓటర్ జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్%-%సర్) కార్యక్రమాన్ని నిశితంగా పరిశీలిస్తే మా దృష్టికి వచ్చిన వాస్తవాలను వివరించడమే ఈ వ్యాస లక్ష్యం. కొత్త ఓటర్ జాబితాల నాణ్యతను అంచనా వేసేందుకు గాను ఓటర్ల నమోదు కార్యక్రమాలకు అంతర్జాతీయ స్థాయిలో అంగీకారయోగ్యమైన మూడు మార్గదర్శక సూత్రాలను ప్రాతిపదికగా తీసుకున్నాం: సమగ్రత, నిష్పాక్షికత, నిర్దుష్టత. తొలుత ఓటర్ జాబితా సమగ్రతను చూద్దాం. ఓటర్ జాబితాలో చోటు చేసుకున్న అర్హులైన జనుల నిష్పత్తిని దీనికి కొలమానంగా తీసుకున్నాం. గత జూలైలో ప్రచురితమైన ముసాయిదా ఓటర్ జాబితాలలో చోటుచేసుకున్న వయోజనుల నిష్పత్తి ఈ స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌లో దిగ్భ్రాంతికరంగా 97 శాతం నుంచి 88 శాతానికి తగ్గిపోయింది. తుది ఓటర్ల జాబితాలో కొంతమేరకు మెరుగుదల కనిపించినప్పటికీ, విస్తృత పరిశీలనలో పరిస్థితుల్లో పెద్దగా మార్పు లేదని స్పష్టమయింది. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కారణంగా ఓటర్లకు%-%జనాభాకు మధ్య నిష్పత్తి గణనీయంగా పడిపోయింది మరి. భారత ప్రభుత్వ నిపుణుల బృందం విడుదల చేసిన జనాభా అంచనాల ప్రకారం సెప్టెంబర్ 2025లో బిహార్‌లో 8.22 కోట్ల మంది ఓటర్లు ఉండాలి. తుది ఓటర్ జాబితాలో ఉన్నవారు 7.42 కోట్లు మాత్రమే! అంటే దాదాపు 80 లక్షల మంది సంభావ్య ఓటర్లు తుది జాబితాలో కనిపించడం లేదు! ఇదేమంత సంతోషించదగిన విషయం? దీన్నెలా అంగీకరించాలి? తుది ఓటర్ జాబితాలు భ్రమపూరితమైన ఉపశమనాన్ని మాత్రమే కలిగిస్తున్నాయి.ఎందుకని? తుది జాబితా నుంచి తొలగింపులు ముసాయిదా జాబితాల నుంచి తొలగించబడిన 65లక్షల కంటే తక్కువ కాబట్టి నిజానికి రెండు కోట్ల మంది ఓటర్లు తొలగింపుకు గురవుతారని భయపడ్డాము. అంత పెద్ద సంఖ్యలో ఓటు హక్కు తొలగింపులు సంభవించలేదంటే అందుకు కారణం 'సర్' గానీ, భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) కానీ కాదు. దేశ సర్వోన్నత న్యాయస్థానం అప్రమత్తత వల్లే అటువంటి అప్రజాస్వామిక చర్య చోటుచేసుకోలేదు. సుప్రీంకోర్టు కృతనిశ్చయంతో 'సర్' అమలును పర్యవేక్షించింది. గౌరవ భంగం కాకుండా ఉండేందుకు ఈసీఐ తన ఆదేశాలకు, కార్యనిర్వహణ పద్ధతులకు భిన్నంగా వ్యవహరించింది. తొలుత ఎన్యూమరేషన్ ఫామ్‌లను సమర్పించని ఓటర్లు పెద్ద సంఖ్యలో లేరనే వాస్తవాన్ని కప్పిపుచ్చేందుకు కచ్చితంగా ప్రయత్నించింది. ఈ ప్రకారం కనీసం 20 శాతం ఎన్యూమరేషన్ ఫామ్‌లను బీఎల్ఓలే నింపి ఈసీఐకు సమర్పించడం జరిగింది. ఈ ఫోర్జరీని ఈసీఐ ప్రోత్సహించింది. పిదప సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఆధార్ కార్డును ఓటర్ నమోదుకు ఒక ప్రామాణిక పత్రంగా ఈసీఐ అంగీకరించింది. తుది జాబితాలలో నిష్పాక్షికత ఉన్నదా? ఓటుహక్కుకు అర్హులైన జనాభాలో తమ నిష్పత్తికి సమరీతిలో అన్ని సామాజిక బృందాలకు ప్రాతినిధ్యం లభించిందా? దళితులకు, వచ్చిపోయే వలసకారులకు ఈ విషయంలో న్యాయం ఏ మేరకు జరిగింది? వీటిపై మరింత నిశిత శోధన జరగవలసివున్నది. మహిళలు, ముస్లింలకు న్యాయం జరగలేదన్నది మా పరిశీలనలో స్పష్టంగా వెల్లడయింది. బిహార్ ఓటర్ జాబితాలలో మహిళల నిష్పత్తి రాష్ట్ర జనాభాలో వారి వంతు కంటే ఎప్పుడూ తక్కువగా ఉండడం పరిపాటి. ఇటీవలి సంవత్సరాలలో ఈ అంతరం తగ్గింది. 2012లో 21 లక్షలుగా ఉండగా అది ఈ ఏడాది 7 లక్షలకు తగ్గింది. 'సర్'తో ఈ అంతరం మరింతగా తగ్గక పోగా 16 లక్షలకు పెరిగింది. ముస్లింల విషయంలో సాక్ష్యాధారాలు స్పష్టంగా లేవు. ఈసీఐ రికార్డుల్లో ముస్లింలు ఒక అధికారిక వర్గంగా లేకపోవడమే అందుకు కారణం. అయితే పేర్ల గుర్తింపు సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగించగా ఆందోళనకరమైన వాస్తవాలు వెల్లడయ్యాయి. ముసాయిదా ఓటర్ జాబితాల నుంచి మినహాయింపబడిన 65 లక్షల మంది ఓటర్లలో ముస్లింలు 24.7 శాతం కాగా తుది జాబితాల నుంచి తీసివేసిన 3.88 లక్షల పేర్లలో వారు 33 శాతంగా ఉన్నారు. రాష్ట్ర జనాభాలో వారి నిష్పత్తి 16.9 శాతంగా ఉండడం గమనార్హం. అంటే ఆరు లక్షల ముస్లిం ఓటర్ల పేర్లను అదనంగా తొలగించారు. తుది ఓటర్ జాబితాలు నిర్దుష్టంగా ఉన్నాయా? ప్రత్యేక సమగ్ర సవరణతో ఈ విషయంలో పరిస్థితి మరింత దిగజారినట్టు అర్థమవుతున్నది. 'సర్' ముందు జాబితాలు, 'సర్' తరువాతి జాబితాలలోని నిర్దుష్టతపై మరింత పరిశీలన జరగవలసి ఉన్నది. అయితే మా ప్రాథమిక విశ్లేషణ ప్రకారం ఓటర్ జాబితాలను ప్రక్షాళన చేశామన్న ఈసీఐ వాదన సమర్థనీయంగా లేదు. తుది ఓటర్ జాబితాలలో 24 వేల పేర్లు అర్థంకాని రీతిలో ఉన్నాయి. 5.2 లక్షల పేర్లు నకిలీవి. 6,000 మంది ఓటర్ల జెండర్ ఏమిటో స్పష్టంగా తెలియడం లేదు.రెండు లక్షల మంది ఓటర్ల ఇంటి నెంబర్లు సక్రమంగా లేవు. ప్రక్షాళన జరగాల్సింది ఇలాగేనా? చాలా అంశాలలో ముసాయిదా జాబితాల కంటే తుది జాబితాలు మరింత ఘోరంగా ఉన్నాయి. ఓటర్ జాబితాల నుంచి విదేశీయుల (బంగ్లాదేశీయులు, రోహింజ్యాలు అని చదువుకోండి) పేర్లను తొలగించడమే 'సర్' లక్ష్యమని బీజేపీ వాదించింది. ఈ వాదనతో ఈసీఐ ఏకీభవించింది. అయితే 'సర్'కు సంబంధించి ఈసీఐ తొలగించిన ఓటర్ల పేర్లను ఏ కారణాలతో తొలగించడం జరిగిందీ రోజువారీ బులెటిన్‌లో వివరంగా తెలిపారు. అయితే ఇంటింటికి వెళ్లి ధ్రువీకరించుకున్న కార్యక్రమంలో ఎంతమంది విదేశీయులు తమ దృష్టికి వచ్చారన్న విషయమై ఎలాంటి వివరాలను ఈసీఐ వెల్లడించలేదు. విదేశీయుడు అన్న కారణంగా ఏ ఒక్క ఓటరు విషయంలోనూ బీజేపీ తన అభ్యంతరాన్ని ఈసీఐకి తెలుపలేదు. బిహార్ సీఈఓ వెబ్‌సైట్ ముసాయిదా జాబితాలకు 2.4 లక్షల ఫిర్యాదులు తమకు అందాయని పేర్కొంది. వీటిలో 1,087 మాత్రమే (మొత్తం ఓటర్లలో వీరు 0.015 శాతం మాత్రమే) భారతీయ పౌరులు కారనే కారణంతో చేసినవి. ఈ ఫిర్యాదుల్లో 226 మాత్రమే ముస్లింలకు వ్యతిరేకంగా ఉన్నవి కనుక మిగతా 779 విదేశీయులు అన్న ఆక్షేపణతో చేసినవి అయివుంటాయి. బహుశా వారంతా నేపాలీలు అయివుండొచ్చు. ఈ ఫిర్యాదుల్లో 390ని మాత్రమే ఈసీఐ ఆమోదించింది. తుది జాబితాల నుంచి సదరు ఓటర్ల పేర్లను తీసివేసింది. ఇలా తీసివేతకు గురైన వారిలో ముస్లింలు 87 మంది మాత్రమే ఉన్నారు. పారదర్శకత, సక్రమత అనే ప్రమాణాల ప్రాతిపదికన ఈ తుది జాబితాల నాణ్యతను నిర్ధారించేందుకు సంపూర్ణ తనిఖీకి వేచివుండవలసిన అవసరం లేదు. 2003 నాటి సమగ్ర సవరణ ఉత్తర్వు ప్రతిని అందించాలని సమాచార హక్కు చట్టం కింద చేసిన అభ్యర్థనకు ఈసీఐ ప్రతిస్పందించనే లేదు. తుది ఓటర్ల జాబితాలను సరైన రీతిలో విడుదల చేయనేలేదు.

## వాగు ఉధృతి.. ప్రమాదకరంగా వాగు దాటుతున్న గిరిజనులు



అల్లూరి జిల్లా,అక్టోబరు 8 (టుడే విదుర): జిల్లాలోని అనంతగిరి మండలం లుంగపర్తి పంచాయతీ ఒనుకొండ గ్రామానికి వెళ్లే రహదారిలో వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. ఈ క్రమంలో సంబంధిత గ్రామాల గిరిజనులు వరద ఉధృతిలో ప్రమాదకరంగా వాగు దాటుతున్నారు. కురిసిన భారీ వర్షానికి వాగులో నీటి ప్రవాహం ఎక్కువగా ఉంది. తప్పనిసరి పరిస్థితుల్లో గ్రామానికి చేరుకోవాలంటే ఈ వాగును దాటాల్సిన పరిస్థితి. దీంతో ప్రమాదకర పరిస్థితిలోనే ఒకరికొకరు సాయం చేసుకుని వాగు దాటుతున్నారు గిరిజనులు.ప్రతి ఏడాది వర్షాలు కురిసినప్పుడు ఇదే పరిస్థితి నెలకొంటుందని సమీప గ్రామాల ప్రజలు వాపోతున్నారు. నిత్యావసరాలు, విద్యార్థులు చదువుల కోసం వెళ్లాలంటే ఈ నీటి ప్రవాహాన్ని దాటుకుని వెళ్లాల్సి వస్తోందని వారు ఆవేదన చెందుతున్నారు. అధికారులు తమ గ్రామానికి వెళ్లే రహదారులో వంతెన నిర్మించాలని ఒనుకొండ పరిసర గ్రామాల గిరిజనులు కోరుతున్నారు. మరి వీరి ఆవేదనపై అధికారులు ఎలా స్పందిస్తారో చూడాలి మరి.

## ఇబ్రహీంపట్నంలోనూ నకిలీ యూనిట్



విజయవాడ, అక్టోబరు 8 (టుడే విదుర): అన్నమయ్య జిల్లా ములకలచెరువులో తయారు చేసిన నకిలీ మద్యాన్ని ఎన్టీఆర్ జిల్లాలో అమ్మారు. అంతేగాక ఇబ్రహీంపట్నంలోనూ మద్యం తయారీ యూనిట్‌ను తెరిచారు. ఇబ్రహీంపట్నంలోని ఏఎన్ఆర్ బార్‌లో కనిపించిన నకిలీ మద్యం మరకలు విజయవాడలోని ఓ వైన్ షాపులో కనిపించాయి. బార్ యజమాని, నకిలీ మద్యం కేసులో ప్రధాన నిందితుడు అద్దేపల్లి జనార్దనరావు భాగస్వామ్యంతో నడుసున్న విజయవాడ విద్యాధరపురంలో ఉన్న శ్రీనివాస వైన్స్‌లో నకిలీ మద్యం విక్రయించినట్లు ఎక్సైజ్ అధికారులు గుర్తించారు. ఈ వ్యవహారంలో వైన్స్‌లో మేనేజర్‌గా పనిచేస్తున్న అంగులూరి కల్యాణ్ కీలకంగా వ్యవహరించాడు. ప్రతివారం 15 కేసుల నకిలీ మద్యాన్ని జనార్దనరావు వద్ద నుంచి కొనుగోలు చేసేవాడు. ఆ సరుకుని శ్రీనివాస వైన్స్‌లో ఉంచి అమ్మేవాడు. ఇలా వచ్చిన ఆదాయంలో సగ భాగాన్ని కల్యాణ్ తీసుకునేవాడు. ఎక్సైజ్ పోలీసులు కోర్టుకు సమర్పించిన రిమాండ్ రిపోర్టులో ఈ విషయాన్ని పేర్కొన్నారు. విద్యాధరపురంలో ఉన్న శ్రీనివాస వైన్స్ షాపు లైసెన్స్ జనార్దనరావు స్నేహితుడి పేరు మీద ఉంది. మూడు నెలలుగా ఏఎన్ఆర్ బార్‌లోనే కాకుండా శ్రీనివాస వైన్స్‌లోనూ నకిలీ మద్యం విక్రయించినట్లు ఎక్సైజ్ అధికారులు నిర్ధారించారు.అప్పుల ఊబిలో కూరుకుపోయిన అద్దేపల్లి జనార్దనరావు అందులో నుంచి బయటకు రావడానికి నకిలీ మద్యం తయారీని ఎంచుకున్నాడు. దీనికి సంబంధించిన ముడిసరుకు, సామగ్రిని బెంగళూరు నుంచి రప్పించేవాడు. 4 నెలల క్రితం అన్నమయ్య జిల్లా ములకలచెరువులో జనార్దనరావు నకిలీ మద్యం తయారీని ప్రారంభించాడు. స్పిరిట్, సీల్స్, మూతలు, చక్కెర, మిషనరీని బెంగళూరు నుంచి బాలాజీ అనే వ్యక్తి సరఫరా చేసేవాడు. హైదరాబాద్‌కు చెందిన రవి నకిలీ లేబుళ్లను సమకూర్చేవాడు. జనార్దనరావు, జగన్మోహనరావుది ఉమ్మడి కుటుంబం. ఇబ్రహీంపట్నంలో ఇద్దరూ ఒకే ఇంట్లో నివసిస్తున్నారు. నకిలీ మద్యం తయారీని ఇబ్రహీంపట్నంలో 3 నెలల క్రితం మొదలుపెట్టారు. జనార్దనరావు బార్ నడుపుతుండగా, జగన్మోహనరావు కిరాణా షాపు నిర్వహిస్తున్నాడు. ఇబ్రహీంపట్నానికి చెందిన సయ్యద్ హాజి, కట్టా రాజు, ఒడిసాలోని గంజాంకు చెందిన బాదల్‌దాస్, ప్రదీప్ దాస్, మిథున్ దాస్, అంతా దాస్‌లు స్పిరిట్ రసాయనాలు మిశ్రమం చేయడం, సీళ్లు వేయడం, లేబుళ్లు అతికించడం చేసేవారు. సయ్యద్ హాజి ఏడేళ్లుగా బార్‌లో పనిచేస్తున్నాడు. ములకలచెరువులో నకిలీ మద్యం తయారీలోకి హాజిని అతడి సోదరుడు అధిక వేతనానికి తీసుకెళ్లాడు. కట్టా రాజు పదేళ్లకు పైగా కిరాణా షాపు, బార్‌లో పనిచేస్తున్నాడు. అతడూ నకిలీ మద్యం తయారు చేసేవాడు

## తపాల బిళ్లల ప్రదర్శన ప్రారంభం



అక్టోబరు 8 (టుడే విదుర):కాకినాడ స్థానిక సూర్యకళా మందిరంలో ఖిలోత్సవం-2025 జిల్లా స్థాయి ఫిలాటలిక్ ఎగ్జిబిషన్ (తపాలా బిళ్ళల ప్రదర్శన) కార్యక్రమం ప్రారంభం అయింది. ఈ కార్యక్రమంలో జిల్లా అటవీ శాఖాధికారి రామచంద్రరావు పాల్గొని మాట్లాడారు. ఫిలాటలీ అభిరుచి అతి ప్రాచీనమైనదని, తపాలా శాఖ తరచుగా విడుదల చేసే స్టాంపుల వలన ఈ కళ అజరామరంగా భావితరాలకు అందాలని ఆకాంక్షించారు. సాంకేతికత పెరుగుతున్న క్రమంలో ప్రతీ ఒక్కరూ తపాలా బిళ్ళల సేకరణను మంచి అలవాటుగా మార్చుకోవాలని జిల్లా అటవీ శాఖ అధికారి ఎస్ రామచంద్రరావు సూచించారు. తపాల శాఖ తరచూగా విడుదల చేసే స్టాంపులు వల్ల ఆ ప్రాచీనమైన కళ అజరామంగా భావితరాలకు అందాలని ఆకాంక్షించారు. పోస్టల్ స్టాంపులు విద్యార్థులలో ఎంతో విజ్ఞానాన్ని పెంపొందిస్తాయన్నారు. డివిజనల్ సూపరింటెండెంట్ కె.కృష్ణ మాట్లాడుతూ ఈ ఫిలాటలిక్ ఎగ్జిబిషన్ గురువారం కూడా కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాకినాడ పోస్టల్ డివిజన్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ గంటి రామకృష్ణ, సామర్లకోట అసిస్టెంట్ పోస్టల్ సూపరింటెండెంట్స్ పి.వి.రమణమూర్తి, డి.అనిల్ అంబేద్కర్‌కుమార్, ఇతర ఉద్యోగులు ముదుగు లక్ష్మణ్‌కుమార్, బి.బ్రహ్మానాయక్, బి.జగదీశ్, తదితరులు పాల్గొన్నారు.

## కార్తీకమాసం ఏర్పాట్లపై సమీక్ష



అక్టోబరు 8 (టుడే విదుర):శంఖవరం అన్నవరం సత్యనారాయణ స్వామి దేవస్థానంలో ఈ నెల 21 నుంచి నవంబర్ 18 వరకు జరిగే కార్తీక మాసం ఏర్పాట్లపై సమీక్షా సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఎంఎల్ఏ వరుపుల సత్యప్రభ, దేవస్థానం ఛైర్మన్ ఐ.వి.రోహిత్, ఇఒ. వీర్ల సుబ్బారావు, జిల్లాలోని వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంఎల్ఏ సత్యప్రభ మాట్లాడుతూ భక్తులకు ఎక్కడ ఇటువంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. అంచనాలకు మించి వచ్చే యాత్రికులను దృష్టిలో పెట్టుకుని సదుపాయాలు కల్పించాలని సూచించారు. పారిశుధ్య, వైద్య, అగ్నిమాపక, పోలీస్, ఆర్ అండ్ బి, ఆర్‌టిసి, ఇరిగేషన్ అధికారులు సమన్వయంతో పని చేయాలని అన్నారు. తెప్పోత్సవం, గిరి ప్రదక్షిణ, జ్వాలాతోరణం వంటి పర్వదినాల్లో యాత్రికులు అధికంగా వచ్చే అవకాశం ఉందని తెలిపారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా పోలీసులు ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. పంపా నది వద్ద గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలని అన్నారు. గత ఏడాది కొన్ని ఇబ్బందులు ఎదురయ్యాయని, ఆ ఇబ్బందులు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా కార్తీక మాసం నెల రోజులపాటు తీసుకుంటున్న చర్యలపై పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా అధికారులు ఎంఎల్ఏకు వివరించారు. ఈ సమావేశంలో కూటమి పార్టీల నాయకులు పాల్గొన్నారు.

## కుంటల వద్దకు పిల్లలను పంపొద్దు :డీఎస్పీ



పుట్టపర్తి రూరల్,అక్టోబరు 8 (టుడే విదుర): చిన్నపిల్లలు చెరు వులు, నీటికుంటల వద్దకు వెళ్లకుండా తల్లితండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని డీఎస్పీ విజయ్‌కుమార్ సూచించారు. ఎస్పీ ఆదేశాల మేరకు రాత్రి మండల పరిధిలోని బత్తలపల్లిలో డీఎస్పీ గ్రామసభను నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ... వర్షాకాలం నేపథ్యంలో ప్రతిచోట చెరువులు, నీటి కుంటలు నిండుగా ఉన్నాయన్నారు. కావున చిన్నపిల్లలు చెరువు లు, నీటికుంటల వద్దకు వెళ్లకుండా తల్లితండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా పేకాట ఆడితే, గంజాయి, అక్రమ మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సైబర్ క్రైం, చీటింగ్, మహిళలు, చిన్నారుల పట్ల నేరాలు, సోషల్ మీడియా దుర్వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించారుకదిరి: బాలికలు అప్రమత్తంగా ఉం డాలని, సమస్యలు ఎదురైన పుడు నంబర్లు 100కు గానీ, 112కు గానీ ఫోన చేయాలని డీఎస్పీ శివనారాయణస్వామి సూచించారు. ఆయన బుధవారం స్థానిక బాలికల ఎస్టీ హాస్టల్, కళాశాల వి ద్యార్థినులతో సమావేశం నిర్వహించారు. గుడ్ టచ, బ్యాడ్ టచ గురించి వివరించారు. స్త్రీ శక్తి టీం ఎప్పుడూ అందుబాటులో ఉం టుందన్నారు. హాస్టల్‌లో సమస్యలు ఉ ంటే అధికారులు దృష్టికి తీసుకురావలన్నారు.

# మేలికరం మొక్కజొన్నతో అధిక దిగుబడి

కర్నూలు, అక్టోబరు 8 (టుడే విదుర): మొక్కజొన్న పంటలో సరైన సీడ్‌తో పాటు మెలకువలు పాటిస్తే అధిక లాభాలు సాధించవచ్చని వ్యవసాయ శాస్త్రవేత్తలు వెల్లడించారు. కల్లూరు మండలం దిన్నెదేవరపాడులో ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లోని ఆచార్య ఎన్జీరంగా, ధార్వాడ వ్యవసాయ విశ్వ విద్యాలయ శాస్త్రవేత్తలు, ప్రొఫెసర్లు, రీసెర్చ్ విద్యార్థుల బృందం పర్యటించింది. మొక్కజొన్న రైతులతో మాట్లాడి జర్మినేషన్, మెట్టపొలాల్లో మొక్కజొన్న హైబ్రీడ్ సంపూర్ణ పరిశోధన, సాగుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు మాట్లాడుతూ 110 రోజుల్లో ఎకరా సాగులో 40 నుంచి 45 క్వింటాళ్ల దిగుబడిని ఇచ్చే మొక్కజొన్న వంగడాలను సాగు చేస్తే అధిక లాభాలు వస్తాయన్నారు. మార్కెట్‌లో ఇందుకు సంబంధించిన విత్తనాలను చూసి కొనుగోలు చేయాలని రైతులకు సూచించారు. ఈ



కార్యక్రమంలో వ్యవసాయాధికారి రొనాల్డ్ రిగన్, లేపాక్షి సీడ్స్ కంపెనీ ఎండీ మడితాటి సురేష్ రెడ్డి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# పిహెచ్‌సి' డాక్టర్ల సమస్యలను పరిష్కరించండి : సిఎంకి సిపిఎం లేఖ



విజయవాడ :అక్టోబరు 8 (టుడే విదుర): పిహెచ్‌సిలలో పనిచేస్తున్న రెగ్యులర్ డాక్టర్ల సమస్యలను పరిష్కరించి, గ్రామీణ ప్రాంతాలను ప్రజలకు వైద్య, ఆరోగ్య సేవలు కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ సిపిఐ(యం) రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ముఖ్యమంత్రి చంద్రబాబుకి లేఖ రాశారు. ఈ లేఖలో "రాష్ట్రవ్యాపితంగా పిహెచ్‌సిలలో పనిచేస్తున్న దాదాపు 2,800 మంది డాక్టర్లు వారం రోజులుగా తమ సమస్యలు పరిష్కరించమని కోరుతూ సమ్మె నిర్వహిస్తున్నారు. గత నాలుగు రోజులుగా విజయవాడలో దీక్షలు చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాలు, మారుమూల ప్రాంతాల్లో వైద్య ఆరోగ్య సేవలందిచడంలో డాక్టర్లు ముఖ్యపాత్ర పోషిస్తున్నారు. వీరి సమ్మె వలన పేద ప్రజలకు వైద్య సేవలు దూరమవుతాయి. వారి ప్రతినిధులతో చర్చించి సమస్యలను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించమని, గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు వైద్య, ఆరోగ్య సేవలు పూర్తిస్థాయిలో కొనసాగేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నాను.గతంలో ఇన్‌సర్వీస్ డాక్టర్లకు పి.జి.సీట్లలో 30% సీట్లను కేటాయించేవారు. దానిని రాష్ట్ర ప్రభుత్వం 15శాతానికి తగ్గించింది. దీనివల్ల ప్రభుత్వ రంగంలో సేవలందిస్తున్న డాక్టర్లు అదనపు విద్యార్హతలు పొందడానికి, స్పెషలైజేషన్ కోర్సు చదవడం ద్వారా మరింత సేవలందించే అవకాశం తగ్గిపోయింది. అందువలన గతంలో కేటాయించే సీట్లను కేటాయించమని వీరు కోరుకుంటున్నారు. డాక్టర్లు ఎక్కువమంది ప్రయివేటు కార్పొరేట్ ఆసుపత్రులలో వైద్య సేవలందించడానికి మొగ్గు చూపుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ రంగంలో పనిచేస్తున్న డాక్టర్లకు ఈ సీట్లు కేటాయింపు ప్రోత్సాహకంగా ఉంటుంది. ప్రమోషన్ సౌకర్యం కల్పించమని, నోషనల్ ఇంక్రిమెంట్‌లు ఇవ్వమని, ఏజెన్సీ ఏరియాల్లో పనిచేస్తున్నవారికి ప్రత్యేక అలవెన్సు ఇవ్వాలని, 104 సేవలలో పనిచేస్తున్న డాక్టర్లకు అదనపు అలవెన్సులు చెల్లించమని డాక్టర్లు కోరుతున్నారు. ఈ సమస్యలన్నింటినీ వారి ప్రతినిధులతో చర్చించి వెంటనే పరిష్కరించమని విజ్ఞప్తి చేస్తున్నాను." అని పేర్కొన్నారు.

# అవును.. వీళ్లు బతికే ఉన్నారు...

తిరుపతి అక్టోబరు 8 (టుడే విదుర):మానవత్వమే సిగ్గుపడే దృశ్యం ఇది. తిరుపతి రుయా ఆసుపత్రికి ఎదురుగా ఇస్కాన్ రోడ్డులోని బస్టాపలో బతికున్న శవాల్లా పడివున్నారు వీరంతా. ఎవరో తెలీదు. ఎక్కడి నుంచి ఎలా వచ్చారో తెలీదు. ఎప్పుడొచ్చి ఈ నీడకు చేరారో ఏమో.. మూలుగుతూ ముక్కుతూ కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతూ ఉన్నారు. మొన్న ఆరుగురు. నిన్న ఐదుగురు. ఈరోజు రాత్రికి నలుగురు మిగిలారు. వెళ్లిపోయారో, చచ్చిపోయారో తెలీదు. %దూసుకుపోయే వాహనాలు.. నడచిపోయే మనుషులు.. ఎవరికీ పట్టని ఈ ప్రాణమున్న శవాలకు సందెచీకటి వాలేవేళ మందుపూస్తూ, అన్నం పెడుతూ, నీళ్లు తాగిస్తూ అలిపిరి అమ్మగా పేరుపడ్డ సుజాత కనిపించారు. ఈరోజు కన్నుమూసిన వ్యక్తికి పూలమాలవేసి, దణ్ణం పెట్టుకుని ఆమె సాగనంపారు.దివ్యక్షేత్రమైన తిరుమలకు తొలిమెట్టు అయిన అలిపిరిలో ఇది సాధారణ దృశ్యం. పవిత్ర భావనతో



శ్రీనివాసుడి దగ్గరకు పయనమయ్యేవారి మనసు వికలమయ్యే చిత్రం. దేవుడిమీద భారం వేసి అలిపిరికి చేరుకుని ఇలా కన్నుమూస్తున్నవారికి జానెడు నీడ, పిడికెడు ముద్ద, రోగానికి మందు ఇచ్చే విశాల హృదయం టీటీడీకి కలిగితే బావుణ్ణు!

# దుబాయ్‌లో జిల్లా యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి




సోంపేట రూరల్, అక్టోబరు 8 (టుడే విదుర):బతుకుతెరువు కోసం దుబాయ్ వెళ్లిన పాలవలస గ్రామానికి చెందిన తామాడ ఓంకార్ (21) అక్కడే అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. తల్లి నీల వేణి, చిన్నాన్న సోమశేఖర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. గ్రామంలో వెల్డింగ్ పనులు చేసుకుంటూ తల్లిని పోషించుకుంటున్న ఓంకార్‌కు ఆర్థిక ఇబ్బందు లు ఎదురవడంతో ఉపాధి కోసం ఆరు నెలల కిందట దుబాయ్ వెళ్లాడు. అక్కడ ఓ ప్రైవేటు కంపెనీలో ఏసీ టెక్నీషియన్‌గా వని చేస్తున్నాడు. రోజూ కుటుంబ సభ్యులతో మాట్లాడుతుండేవాడు. అయితే నాలుగు రోజులుగా అతడి నుంచి ఫోన్ రాకపోవడంతో గ్రామస్థులు తోటి కార్మికులను సంప్రదించారు. ఈ నెల 3న ఓంకార్ మృతి చెందినట్టు వారు సమాచారమిచ్చా రు. మృతికి కారణాలు వారి నుంచి స్పష్టంగా తెలియలేదని కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. మృతుడి తండ్రి ఐదేళ్ల కిందట మృతి చెందాడు. కాగా మృతదేహాన్ని స్వగ్రామానికి రప్పించాలని ఎమ్మెల్యే అశోక్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి చంద్రమో హన్ ద్వారా కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడుకు ఫ్యాక్స్‌లో వేడు కున్నారు. దీనికి ఆయన సానుకూలంగా స్పందించి మృతదేహం రప్పించేందుకు చర్యలు తీసుకుంటానని భరోసా ఇచ్చినట్లు ఎంపీటీసీ మాజీ సభ్యులు చెల్లూరు ధర్మ, నాయకులు మన్మ?థరావు, రామదాసు తెలిపారు. కుమారుడి మృతితో ఆ తల్లి ఆవేదన వర్ణణాతీతం. గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.

# ఆటోను ఢీకొట్టిన కారు ముగ్గురికి తీవ్రగాయాలు




పెద్దదోర్నాల (ప్రకాశం జిల్లా) అక్టోబరు 8 (టుడే విదుర):ఆటోను కారు ఢీకొట్టడంతో ముగ్గురికి తీవ్రగాయాలైన ఘటన ప్రకాశం జిల్లా పెద్దదోర్నాలలో జరిగింది. పెద్దదోర్నాల మండలం యడవల్లి గ్రామంలో తిరుమలనాథ స్వామి దేవాలయం దగ్గర కూలీ పనుల నుండి వస్తున్న ఆటోను కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఒడిచర్ల కృష్ణారెడ్డి, చిట్యాల సరస్వతి, అల్లు నారాయణమ్మలకు తీవ్రగాయాలు అయ్యాయి. గాయపడినవారిని పెద్దదోర్నాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, చిట్యాల సరస్వతి పరిస్థితి విషమంగా ఉండడంతో నరసరావుపేటకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# గంజాయితో స్మగ్లర్ అరెస్టు



పలాస, అక్టోబరు 8 (టుడే విదుర): స్థానిక రైల్వే స్టేషన్ రోడ్డులో కర్ణాటక రాష్ట్రం జోకటి గ్రామానికి చెందిన షా కత్ ఆలీ అనే గం జాయి స్మగ్లర్ రాత్రి పట్టుబడినట్టు కాశీబుగ్గ సీఐ పి.సూర్యనారాయణ తెలిపారు. స్థానిక పోలీస్టేషన్‌లో ఇందుకు సంబంధించిన వివరాలను ఆయన విలేకరులకు వివరిం చారు. బరంపూర్ (ఒడిశా)కు చెందిన అజయ్‌కుమార్ బెహరా నుంచి షాకత్ ఆలీ కిలో రూ.5వేలు మూడు కిలోల గంజాయి కొనుగోలు చేశాడు. దీనిని కర్ణాట కలో ఉన్న మహ్మద్ పర్వేజ్‌కు విక్రయించేందుకు మంగళవారం రాత్రి వస్తుండగా కాశీబుగ్గ ఎస్ఐ జి.నర్సింహమూర్తికి పట్టుబడ్డాడు. దీంతో అతడి నుంచి గంజా యితోపాటు మొబైల్‌ఫోన్, రూ.400 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ మేరకు నిందితుడ్ని పలాస కోర్టులో హాజరుపరిచినట్టు సీఐ తెలిపారు.

# నెలాఖరులో షార్ నుంచి మరో ప్రయోగం



సూళ్లూరుపేట,అక్టోబరు 8 (టుడే విదుర): భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) మరో ప్రయోగానికి సన్నాహం చేస్తోంది. సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ షార్ నుంచి ఈ నెలాఖరులో ఎల్‌వీఎం3-ఎం5 రాకెట్ ద్వారా కమ్యూనికేషన్ రంగానికి చెందిన జీశాట్-7ఆర్ (సీఎంఎస్3) ఉపగ్రహాన్ని రోదసిలోకి పంపనున్నారు. షార్‌లోని రెండో ప్రయోగ వద్ద రాకెట్ అనుసంధాన పనులను శాస్త్రవేత్తలు పూర్తి చేశారు. ఈ రాకెట్ ద్వారా మొదట అమెరికాకు చెందిన బ్లూబర్డు ఉపగ్రహాన్ని పంపాల్సి ఉంది. అయితే చిన్నపాటి సమస్య తలెత్తి ఆ ప్రయోగం ఆలస్యం కావడంతో జీశాట్-7ఆర్‌ను పంపేందుకు శాస్త్రవేత్తలు కృషి చేస్తున్నారు.

# గుంటూరులో రూ.కోటి నకిలీ సిగరెట్లు స్వాధీనం



గుంటూరు(కార్పొరేషన్), అక్టోబరు 8 (టుడే విదుర): ప్రముఖ బ్రాండ్ల పేరుతో నకిలీ సిగరెట్లు తయారు చేస్తున్న వారి గుట్టును సెంట్రల్ ఎక్సైజ్ అధికారులు రట్టుచేశారు. రాత్రి గుంటూరులోని కాకాని రోడ్డులో ఉన్న అన్నపూర్ణ కాంప్లెక్స్ షాపు నంబరు 106లో అక్రమంగా నిల్వ ఉంచిన రూ. కోటి విలువైన సిగరెట్లను స్వాధీనం చేసుకున్నారు. దుకాణాన్ని సీజ్ చేశారు. ఇక్కడ ప్రముఖ బ్రాండ్‌ల పేరుతో సిగరెట్లను తయారు చేసి రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు తరలిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. నిందితులపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

## ఆడ బిడ్డలే... అవనికి వెలుగులు




తనకల్లు,అక్టోబరు 8 (టుడే విదుర):ఆడబిడ్డలే అవనికి వెలుగులని నల్లచెరువు ఐసీడీఎస్ సీడీపీఓ వెంకట లక్ష్మమ్మ పేర్కొ న్నారు. మండలంలోని రాజువారిపల్లి సమీపంలో ఉన్న కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ బాలి కా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ సెప్టెంబరు నెలలో జ న్మించిన ప్రతి ఆడబిడ్డ పేరు మీద ఒక మొక్క నాటి సంరక్షించాలని కోరారు. ఆడపిల్లలు అన్ని రంగాలలో రాణించాలని సూచిం చారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత, స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర ప థకాల ప్రాముఖ్యాన్ని వివరించారు. అనంతరం వ్యాసరచన పోటీ లు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ర్యాలీ నిర్వహించిన అనంతరం పాఠశాల ఆవరణంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో పాఠశాల ఎస్ఓ అమీదా, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మీదేవమ్మ, అంగనవాడీ కార్యకర్త లు, ఆయాలు, కేజీబీవీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## దెబ్బతిన్న వేరుశనగ పంట పరిశీలన



ధర్మవరం రూరల్, అక్టోబరు 8 (టుడే విదుర):గడ్డిమందు పిచికారి చేయడంతో మండలంలోని చిగిచెర్ల గ్రామానికి చెందిన రైతు సాయినాథ్ రెడ్డి మూడెకరాల్లో సాగుచేసిన వేరుశనగ పంట ఎండిపోయింది. దీనిపై లో 'ముంచిన గడ్డిమందు' అనే శీర్షికతో కథనం ప్రచురితమైన విషయం విదితమే. దీనిపై స్పందించిన మండల వ్యవసా యాధికారి ముస్తఫా సిబ్బందితో కలిసి రైతుపొలాన్ని పరిశీలించారు. రైతుపిచికారి చేసిన మందు అట్రాజైనగా గుర్తించారు. ఈ మందును మొక్కజొన్న పంటకు మాత్రమే పిచికారి చేయాలన్నారు. ఇటువంటి మం దుల పిచికారి వల్ల పంటలు నష్టపోయే ప్రమాదం ఉందని ఏఓ తెలిపారు.పంటలలో గడ్డి మందులు పిచికారి చేసేటప్పుడు తప్పనిసరిగా వ్యవసాయాధికారుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు. ఎవరైనా గ్రామాలకు వచ్చి రసాయనిక మందులు అమ్మకాలు జరిపితే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. మందు కోనుగోలు చేసినట్లు రసీదులు లేవని రైతు తెలుపగా, రసాయనిక మందులు కోనుగోలు చేస్తే తప్పకుండా రసీదులు పొందాలని సూచించారు. రైతుకు జరిగిన నష్టంపై ఉన్నతాధికా రులకు నివేదిక ఇస్తామని తెలిపారు. ఏఓ వెంట జడ్పీ మాజీచైర్మన ఓబిరెడ్డి, రాఘవరెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఉణుకూరు ఫీల్డ్‌అసిస్టెంట్‌పై విచారణ



రేగిడి, అక్టోబరు 8 (టుడే విదుర): మండలంలోని ఉణుకూరు ఫీల్డ్‌అసి స్టెంట్ ఎం.జగన్నాథం నాయుడుపై ఉపాధి అధికారులు గ్రామంలో మరోసారి విచారణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఫీల్డ్‌అసి స్టెంట్, ఫిర్యాదుదారుడు మద్దతుదారుల మధ్య వాగ్వాదంచోటుచేసుకుంది. ఫీల్డ్‌అసిస్టెంట్ తప్పుడు మాస్టర్లతో నిధులు స్వాహా చేయడం తదితర అభియోగాలతో గ్రామానికి చెందిన పి.విశ్వనాథం పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదుచేశా రు. దీనిపై గతంలో విజయనగరం క్లస్టర్ ఏపీడీ విచారణచేశారు. ఈవిచా రణ సంతృప్తిచెందని ఆయన మరోసారి ఉన్నతాధికారులను ఆశ్రయించాడు. దీనిపై ఉపాధిపీడీ ఆదేశాలతో రాజాం క్లస్టర్ ఉపాధి ఏపీడీ చంద్రావతి మరో సారి సమగ్రవిచారణ నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీవో శ్రీనివాసరావు, జేఈ మురళి, వెంకటే శ్వరరావు, బాలమురళీధర్, టీఏ భారతి పాల్గొన్నారు.

## బస్సు డ్రైవర్‌పై ప్రయాణికుడి దాడి




ఆళ్లగడ్డ, అక్టోబరు 8 (టుడే విదుర): అద్దె బస్సు డ్రైవర్‌పై ఓ ప్రయాణికుడు దాడి చేయడంతో డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో ఆళ్లగడ్డ ఆర్టీసీ డిపోలో పని చేస్తున్న ప్రైవేటు బస్సుల డ్రైవర్లు విధులను బహిష్కరించి ధర్నా నిర్వహించారు. వివరాలు ఇలా ఉన్నాయి... ఆళ్లగడ్డ డిపో పరిధిలో నడుస్తున్న ఆర్టీసీ హయ్యర్ బస్సును దువ్వూరు వద్ద ఆపలేదని ఓ ప్రయాణికుడు డ్రైవర్ మహమ్మద్‌పై దాడి చేశాడు. డ్రైవర్ తలకు బలమైన గాయం కావడంతో ప్రైవేటు బస్సుల డ్రైవర్లు బస్సులను డిపో ఆవరణంలో ఉంచి సీఐటీయూ కార్యద ర్శి శ్రీనివాసులు ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిరసన తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ ఆళ్లగడ్డ డిపోకు చెందిన బస్సు డ్రైవర్ మహమ్మద్‌పై దాడి చేసిన వ్యక్తిపై నాన్‌బెయిలబుల్ కేసు నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. దాడికి నిరసనగా నంద్యాల, కోవెలకుంట్ల, ఆత్మకూరు, నందికొట్కూరు, మైదుకూరు, రాజంపేట, జమ్మలమడుగు డిపోలలోని ప్రైవేటు బస్సుల డ్రైవర్లు పాల్గొన్నట్లు సంఘం నాయకులు తెలిపారు. ఒక్కసారిగా ప్రైవేటు బస్సులు నిలిచి పోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

డ్రైవర్‌పై దాడిని ఖండిచిన ఆర్ఎం

ఆళ్లగడ్డ– మైదుకూరు హయ్యర్ బస్సు డ్రైవర్ మహమ్మద్ పై జరిగిన దాడిని నంద్యాల రీజనల్ మేనేసర్ రజియా సుల్తానా తీవ్రంగా ఖండించారు. విషయం తెలిసిన వెంటనే ఆమె ఆళ్లగడ్డ ఆర్టీసీ డిపోకు తరలి వచ్చారు. దాడి ఘటనపై సిబ్బందిని వివరాలు అడిగి తెలుసు కున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఈ సంఘటనతో జిల్లా వ్యాప్తంగా హయ్యర్ బస్సుల డ్రైవర్లు ?ధర్నాలో పాల్గొన్నారన్నారు. దాడి విషయాన్ని ఆళ్లగడ్డ డీఎస్పీ ప్రమోద్ దృష్టికి తీసుకెళ్లామని బాధిత డ్రైవర్‌కు న్యాయం చేస్తామని ఆమె హామీ ఇచ్చారు.

## ఆదర్శ పాఠశాలలో అరుదైన జంతువు



పుట్లూరు: అఅక్టోబరు 8 (టుడే విదుర):అరుదైన జంతువైన మురుగు పిల్లి అనంతపురం జిల్లా పుట్లూరు మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో కనిపించింది. ప్రిన్సిపాల్ రూమ్ లోని బాత్రూంలో అరుదైన మురుగు పిల్లి ప్రత్యక్షమైనది. ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ ఓబుల్ రెడ్డి బాత్రూం కోసం బాత్రూంలోకి వెళ్ళగా అక్కడ వింత జంతువు కనపడడంతో వెంటనే ప్రిన్సిపల్ ఓబుల్‌రెడ్డి అటవీ అధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో వెంటనే అటవీ అధికారులు ఆదర్శ పాఠశాలలకు వచ్చి వింత జంతువు అయినటువంటి మురుగుపెల్లిని చూసి వారు ఇది అరుదైన జంతువులలో ఈ జంతువు ఒకటి అన్నారు. ఈ మురుగుపిల్లిని అటవీ అధికారులు తీసుకెళ్లినట్లు ప్రిన్సిపల్ ఓబు రెడ్డి తెలిపారు.

## హెల్మెట్ ధరించి ఉంటే ప్రాణాలతో ఉండేవారు



వెదురుకుప్పం (చిత్తూరు జిల్లా)అక్టోబరు 8 (టుడే విదుర): హెల్మెట్ ధరించి ఉంటే ఆ యువకులు ప్రాణాలు పోయేవి కావు. చిన్న చిన్న దెబ్బలతో అయిన. బతికి బయటపడే వారిని స్థానికులు అంటున్నారు. చనిపోయిన యువకుల కుటుంబాల్లో వారు గుర్తుకు వచ్చినప్పుడల్లా జీవితాంతం విషాదం ఉంటుంది. ఆ బాధను ఆ తల్లిదండ్రులు బతికి ఉన్నంతకాలం భరించాల్సిందే.. ఎన్నో. కష్టనిష్టాలు సంఘంలో అవమానాలు బాధలు అన్నిటిని ఓర్చుకొని , నిలబడి ఆ బిడ్డల భవిష్యత్తే తమ జీవితంగా బతుకుతారు. అలాంటి సమయంలో కన్న బిడ్డలు కళ్ళముందే చనిపోయారని తెలిస్తే ఆ బాధ ఎలా ఉంటుందో చెప్పనక్కర్లేదు ఆ కుటుంబాల బాధను పాఠకులకు అందించే ప్రయత్నంలో చిత్తూరు జిల్లా గంగాధర నెల్లూరు నియోజకవర్గం పరిధిలో వెదురు కుప్పం మండలం ఉంది. ఈ మండలంలో 25 పంచాయతీలు ఉన్నాయి. ఈ పంచాయతీల నుంచి నిత్యం ఇటు తిరుపతికి, అటు చిత్తూరు కి, పుత్తూరు కి ఆర్టీసీ బస్సులు, ఆటోలు, ద్విచక్ర వాహనాలు ఇలా వారి వారి సౌకర్యాలను బట్టి ప్రయాణం సాగిస్తూ ఉంటారు. ఆ సమయంలో కనీస భద్రత కూడా లేకుండా ప్రయాణం సాగిస్తూ ఉంటారని చూసినవారు చెబుతూ ఉంటారు.

ఇందుకు ఓ చిన్న ఉదాహరణ

తిరుపతి జిల్లా , దుర్గ సముద్రం గ్రామం వడ్డీ ఇండ్లు గ్రామానికి చెందిన సాయికుమార్, తేజ తమ ద్విచక్ర వాహనంలో ఇద్దరు వెదురుకుప్పం మండలానికి. ప్రయాణం సాగిస్తూ ఉన్నారు. అదే సమయంలో వెదురు కుప్పం మండలం నుంచి యుగంధర్ రెడ్డి అనే అతను పచ్చికాపల్లం నుంచి తిరుపతి వైపు తమ ద్విచక్ర వాహనంలో వస్తున్నాడు. మార్గమధ్యమంలో పచ్చికాపల్లం పంచాయితీ బొమ్మన్ దొడ్ల గ్రామం దగ్గర రెండు ద్విచక్ర వాహనాలు వేగంగా వచ్చి ఢీకొన్నాయి. ద్విచక్ర వాహనాలు నడుపుతున్న ఇద్దరు అక్కడే అక్కడే ప్రాణాలు వదిలేశారు. తేజ స్వల్ప గాయాలతో తిరుపతి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ప్రమాదం జరగకముందు హెల్మెట్లు వాడి ఉంటే స్వల్ప గాయాలతోనైనా బయటపడి. తల్లిదండ్రులకు పుత్రశోకం నుంచి ఇరు కుటుంబాల వారు బయటపడే వారిని అక్కడి చూచిన స్థానికుల మాటలు. ఇది పాఠకులకు విధియతమే.

## నెల్లిపట్ల అడివిలో రెండు ఎర్రచందనం దుంగలు లభ్యం



–బైరెడ్డిపల్లి:అక్టోబరు 8 (టుడే విదుర): ఆంధ్ర తమిళనాడు సరిహద్దు ప్రాంతమైన బైరెడ్డిపల్లి మండలంలోని నెల్లిపట్ల అడవి ప్రాంతంలో రెండు ఎర్ర చందనం దుంగలు లభించినట్లు అటవీశాఖ అధికారులు వెల్లడించారు. గాలింపు చర్యల్లో భాగంగా క్షేత్ర స్థాయిలో ప్రతి వాహనం తనిఖీ , వివిధ కోణాల్లో అటవీ శాఖ అధికారులు సోదాలు చేస్తుండగా ఈ రెండు ఎర్రచందనం దుంగలు లభించాయని అటవీశాఖాధికారులు తెలిపారు.

## ఆటో పార్కింగ్ స్థలం ఏర్పాటు చేయాలి

కుక్కునూరు రూరల్ :అక్టోబరు 8 (టుడే విదుర): అక్రమ కట్టడాలకు ఉన్న స్థలం ఆటో పార్కింగ్‌కి లేదా అని సిఐటియు జిల్లా కార్యదర్శి యర్నం సాయికిరణ్ అన్నారు. నాడు అల్లూరి సీతారామరాజు ఆటో డ్రైవర్ల యూనియన్ సమావేశం స్థానిక సుందరయ్య భవనం ప్రజాసంఘాలు కార్యాలయంలో పోచారపు వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సాయికిరణ్ మాట్లాడుతూ మండలంలో 100 మందికిపైగా ఆటో డ్రైవర్లుగా, ప్రమాదం అంచున నిత్యం స్థానిక ప్రజలకు రవాణా సేవలు అందిస్తూ జీవనోపాధి పొందుతున్నారన్నారు. అసలే ఆటో డ్రైవర్లకు సర్వీస్ లేక కుటుంబ పోషణ గడవక తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటుంటే, మండల కేంద్రంలో ఆటో పార్కింగ్, పికపింగ్, డ్రాపింగ్ పాయింట్స్ లేకపోవడంతో తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఇప్పటికైనా ఆటో పార్కింగ్ చేసుకోడానికి స్థలం ఏర్పాటు చేయాలని లేదంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

## వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత




తాళ్లరేవు అక్టోబరు 8 (టుడే విదుర): వన్యప్రాణుల సంరక్షణకు ప్రజలందరూ బాధ్యత వహించాలని జిల్లా అటవీ శాఖ అధికారి ఎన్.రామచంద్రరావు అన్నారు. ఈ నెల 2వ తేదీ నుంచి నిర్వహిస్తున్న వన్యప్రాణి వారోత్సవాలు ముగింపు కార్యక్రమం కోరంగి అభయారణ్యంలో ఫారెస్ట్ రేంజర్ ఎస్ఎస్ఆర్ వరప్రసాద్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వన్యప్రాణుల ఆవాసం చాలా పెద్దదని అన్నారు. సహజంగానే వాటికి ఆహారం లభిస్తుందని, ప్రజలు వన్యప్రాణులకు ఎటువంటి ఆహారం అందించ కూడదని అన్నారు. వన్యప్రాణులకు ఉవకారం చేయాలనుకుంటే పండ్ల మొక్కలను పెంచి వదిలేస్తే ఆ పండ్లు తింటాయన్నారు. వన్యప్రాణుల సంరక్షణ ఒక అటవీ శాఖ మాత్రమే కాదన్నారు. విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, చిత్రలేఖనం పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ఆయన బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో అటవీ శాఖ అధికారి శ్రీహర్ష, నేషనల్ గ్రీన్ కోర్ జిల్లా సమన్వయకర్త కేసరి శ్రీనివాస్, పప్పెట్రీ షో పిల్లి గోవిందరాజులు, మ్యాజిక్ షో వివిఎస్‌వి.రమణమూర్తి, సిబిఐటి ఛైర్మన్ పినపోతు ధనుంజయ, వైస్ ఛైర్మన్ బొమ్మిడి ఆదిలక్ష్మి, సెక్షన్ ఆఫీసర్లు కె.సిద్ధార్థ, ఎస్.వీరభద్రరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# మార్కెట్‌లో మధుర ఫలాలు..
# కిలో రూ.100కి పైగానే

హైదరాబాద్:అక్టోబరు 8 (టుడే విదుర):మార్కెట్‌లో సీతాఫలాలు సందడి చేస్తున్నాయి. హోల్‌సేల్ వ్యాపారులు నల్గొండ, వికారాబాద్, మెదక్ ప్రాంతాల అడవుల నుంచి తెప్పించి విక్రయిస్తున్నారు. చిరు వ్యాపారులు తోపుడు బండ్లపై కొందరు రోడ్ల పక్కన, రైతు బజ్జాలో ఇంకొందరు గంపల్లో పెట్టి విక్రయిస్తున్నారు. కిలో రూ.90 నుంచి 150 వరకు లేదా ఒక్కో కాయ రూ.15 నుంచి రూ.20 చొప్పున అమ్ముతున్నారు. కొందరు మగ్గిన పండ్లు, మరికొందరు పక్వానికి రాని కాయలను విక్రయిస్తున్నారు.

%ఎన్నో పోషకాలు..

సీతాఫలంలో ఎన్నో పోషకాలు ఔషధగుణాలు ఉన్నాయని ఆయుర్వేద వైద్యులు చెబుతున్నారు. ఈ పండ్లలో రోగనిరోధక శక్తిని పెంచడంలో దోహదపడే విటమిన్ సి, న్యూరోట్రాన్స్ మీటర్‌కు సహాయపడే విటమిన్ బీ6 అధికంగా ఉంటుందని వారు అంటున్నారు. కెరిటినాయిడ్లు, ఫ్లైవనాయిడ్లు శక్తి వంతమైన యాంటీ ఆక్సిడెంట్లను కల్గి ఉంటుందని ఇది రక్తపోటును నియంత్రిస్తుందని తెలియజేస్తున్నారు. వీటిలో ఫైబర్ అధికంగా ఉండడంతో జీర్ణక్రియను మెరుగు పరచడం.. కేన్సర్ ప్రమాదాన్ని తగ్గిస్తుందని



నిపుణులు సలహాఇస్తున్నారు. ఇందులోని విటమిన్ ఏ దృష్టిని మెరుగు పరచడంలో దోహద పడుతుంది. దీనిలోని బీ6 విటమిన్ మెదడు పని తీరును మెరుగు పరుస్తుందని వారు సూచిస్తున్నారు.

# జడ్జి కారుపై గుర్తు తెలియని వ్యక్తి దాడి.!

హైదరాబాద్: అక్టోబరు 8 (టుడే విదుర): నగరంలో ఒక సంచలన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. నాంపల్లి క్రిమినల్ కోర్టు అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ జడ్జి కారుపై గుర్తు తెలియని వ్యక్తి దాడి చేశాడు.జడ్జి తన కారులో వెళుతుండగా చంచల్‌గూడ జైలు సమీపంలో ఒక వ్యక్తి అకస్మాత్తుగా కారు ముందు నిలబడ్డాడు. ఆ వ్యక్తి కార్ అద్దాలను కొడుతూ, అనుచిత పదజాలంతో జడ్జిని దూషించినట్లు సమాచారం. జడ్జి కారులో ఉన్నారని డ్రైవర్ చెప్పినప్పటికీ, ఆ వ్యక్తి దుర్భాషలాడుతూ బెదిరింపులకు పాల్పడినట్లు తెలుస్తోంది.ఈ ఘటనతో షాక్‌కు గురైన జడ్జి కారు డ్రైవర్ వెంటనే మాదన్నపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు ఆధారంగా పోలీసులు




కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. గుర్తు తెలియని వ్యక్తి ఎవరో తెలుసుకునేందుకు సీసీటీవీ ఫుటేజ్‌లు సేకరించి పరిశీలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనతో న్యాయ వ్యవస్థకు చెందిన వర్గాల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. జడ్జిల భద్రతపై పోలీసులు మరింత జాగ్రత్తలు తీసుకోవాలని సూచనలు వినిపిస్తున్నాయి.

# దీపావళిలోపు రూ.300 కోట్ల
# విడుదలకు హామీ



హైదరాబాద్, అక్టోబరు 8 (టుడే విదుర):ఈ నెల 13వ తేదీ నుంచి సమ్మె చేస్తామని ప్రకటించిన ప్రైవేటు కళాశాలల యాజమాన్య సంఘాల సమాఖ్య(ఫాతీ) దాన్ని వాయిదా వేసింది. దీపావళిలోపు రూ. 300 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయించేందుకు కృషి చేస్తానని ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి ఇచ్చిన హామీతో సమ్మె వాయిదా వేశామని ఫాతీ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ నెల 22లోపు బకాయిలు విడుదల చేయకుంటే 23 నుంచి సమ్మె చేస్తామని ఫాతీ చైర్మన్ నిమ్మగడ్డ రమేష్ బాబు తెలిపారు. సమ్మె వాయిదా గురించి బుధవారం నిర్వహించిన అత్యవసర కార్యవర్గ సమావేశంలో నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. దసరాలోపు ప్రభుత్వం విడుదల చేసిన రూ. 200 కోట్లలో రాష్ట్రంలోని 72 మైనార్టీ కళాశాలలకు ఒక్క పైసా కూడా బకాయిలు చెల్లించలేదని, వెంటనే విడుదల చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# రద్దీగా మెట్రో రైళ్లు..
# ఒక్కరోజే 5.10 లక్షల మందికిపైగా..

హైదరాబాద్ సిటీ:అక్టోబరు 8 (టుడే విదుర):ఒకవైపు వర్షాలు.. మరోవైపు భారీగా ట్రాఫిక్ జామ్‌లు.. నగరంలో అడుగు ముందుకు వేయాలంటే అడుగడుగునా అడ్డంకులు. ఐటీ కారిడార్‌లోనే కాకుండా కోర్ సిటీలోనూ ట్రాఫిక్ జామ్‌లు, ధ్వంసమైన రోడ్లపై ప్రయాణం నరకరంగా మారింది. ఇలాంటి పరిస్థితుల్లో మెట్రో రైలు అనుకూల ప్రజా రవాణా సాధనంగా మారింది. మూడు రోజులుగా మెట్రో రైళ్లు ప్రయాణికులతో రద్దీగా కనిపిస్తున్నాయి. సోమవారం మెట్రోలో 5.10 లక్షల మంది, మంగళవారం 4.90 లక్షల మంది ప్రయాణించారని అధికారులు తెలిపారు.

ఉదయం 8 నుంచి 11, సాయంత్రం 4 నుంచి



రాత్రి 9 గంటల వరకు మెట్రో రైళ్ల లో రద్దీ అధికంగా ఉంటుందన్నారు. ఆర్టీసీ బస్సులు, సొంత వాహనాల్లో ప్రయాణం చేస్తే గంటల తరబడి ట్రాఫిక్‌లోనే ఉండాల్సి వస్తోంది. మెట్రో రైలులో ప్రయాణం చేస్తే చేరాల్సిన గమ్యస్థానానికి నిర్ణీత సమయంలో చేరుకోవచ్చని నగర వాసులు భావిస్తున్నారు.

%అధిక సంఖ్యలో ఐటీ ఉద్యోగులు

ఐటీ కంపెనీల్లో పనిచేస్తున్న ఉద్యోగులు ఎక్కువగా మెట్రో రైళ్లలోనే ప్రయాణం చేస్తున్నారు. ఇటీవల సైబరాబాద్ పరిధిలో చాలా ప్రాంతాల్లో ట్రాఫిక్ జామ్‌లతో తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి. దీనికి తోడు తరచూ కురుస్తున్న భారీ వర్షాల కారణంగా రోడ్లన్నీ జలమయమై గంటల తరబడి రోడ్లపై వరద నీరు నిలిచిపోతోంది.దీంతో రాయదుర్గం మైండ్‌స్పేస్ జంక్షన్, హైటెక్‌సిటీ సైబర్ టవర్స్, దుర్గం చెరువు ప్రాంతాల్లో ఉన్న మెట్రోస్టేషన్‌ల నుంచి లక్షలాది మంది ఐటీ ఉద్యోగులు నిత్యం రాకపోకలు సాగిస్తున్నారు. నిత్యం సుమారు 2-3 లక్షల మంది ఐటీ ఉద్యోగులు మెట్రో రైళ్లలో రాకపోకలు సాగిస్తున్నారని మెట్రో అధికారులు పేర్కొంటున్నారు.

# టాస్క్‌ల పేరిట ఎర...
# ఐటీ ఉద్యోగికి 54 లక్షల టోకరా



Representational Image.

పటాన్‌చెరు, అక్టోబరు 8 (టుడే విదుర): ఉన్నత విద్య అభ్యసించి ప్రముఖ సంస్థలో పని చేస్తున్న ఓ ఐటీ ఉద్యోగి అదనపు ఆదాయానికి ఆశపడి సైబర్ నేరగాళ్ల మాయకు బలయ్యాడు. బ్రాండెడ్ వస్తువులకు రేటింగ్ ఇస్తే పెద్ద మొత్తంలో కమీషన్ ఇస్తామంటూ ఎర వేసి టాస్క్‌ల పేరిట ఓ సైబర్ నేరా ముఠా ఆడిన ఆటకు ఏకంగా రూ.54 లక్షలు పోగొట్టుకున్నాడు. బాధితుడి కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. హెచ్‌సీఎల్ సంస్థలో ఐటీ ఉద్యోగి అయిన బాధితుడు పటాన్‌చెరు ప్రాంతంలో నివాసముంటున్నాడు. సదరు ఐటీ ఉద్యోగి వాట్సాపకు సెప్టెంబరు19న గుర్తు తెలియని ఓ నెంబర్‌ను మెసేజ్ వచ్చింది. తాము పంపిన ఆన్‌లైన్ లింక్ ఓపెన్ చేసి అందులోని బ్రాండెడ్ వస్తువులకు రేటింగ్ ఇస్తే ఆ టాస్క్‌లకు బదులుగా పెద్ద మొత్తంలో కమీషన్ ఇస్తామని ఆ మెసేజ్ సారాంశం. దీంతో బీ-ఏజియోవాల్ టాస్క్-653 పేరిట ఆ మెసేజ్‌లో ఉన్న టెలీగ్రామ్ లింక్‌ను బాధితుడు క్లిక్ చేసి అందులో చేరాడు. అందులో సూచించిన రెండు టాస్క్‌లు పూర్తి చేశాడు. ఆ వెంటనే బాధితుడి బ్యాంకు ఖాతాలో రూ.5వేలు జమ అయ్యాయి. దీంతో అత్యాశకు లోనైన బాధితుడు మరిన్ని టాస్క్‌లు చేసేందుకు సిద్ధమవ్వగా... టాస్క్‌లు కొనుగోలు చేయాలని సైబర్ మాయగాళ్లు బదులిచ్చారు. దీంతో తొలుత రెండు టాస్క్‌ల కొనుగోలుకు బాధితుడు పేటీఎమ్ ద్వారా రూ.12,500 చెల్లించాడు. ఆ టాస్క్‌లకు సంబంధించిన ఆదాయం ఖాతాలో కనిపిస్తుండడంతో నమ్మిన బాధితుడు టాస్క్‌ల కొనుగోలు పేరిట విడతల వారీగా రూ.7,14,180 సైబర్ నేరగాళ్లు చెప్పిన విధంగా ఆన్‌లైన్‌లో బదిలీ చేశాడు. ఆపై, క్రెడిట్ స్కోర్ కోసం రూ. 5లక్షలు, అదనపు కమీషన్ కోసం వీఐపీ చానల్ తెరిచేందుకు రూ.6లక్షలు, నగదు విత్‌డ్రాకు మరో రూ.12లక్షలు ఇలా మొత్తంగా బాధితుడు రూ.54,67, 488లు సైబర్ ముఠాకు చెల్లించాడు. ఈ మొత్తం లాభంతో కలిపి రూ.70లక్షలు అని ఖాతాలో చూపిస్తుండగా వాటిని విత్‌డ్రా చేసుకునేందుకు బాధితుడు ప్రయత్నించగా.. విత్‌డ్రా చేయాలంటే మరో రూ.8లక్షలు చెల్లించాలని సైబర్ ముఠా బదులు ఇచ్చింది. దీంతో మోసపోయానని గ్రహించిన బాధితుడు సాయం కోసం సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించాడు. కాగా, సులువుగా డబ్బు సంపాదించాలనే అత్యాశతో సైబర్ ముఠాల మాయలో పడవద్దని ప్రజలకు పటాన్‌చెరు సీఐ రాజు సూచించారు.

# వాకింగ్‌కు వెళ్తున్న వ్యక్తి కిడ్నాప్..
# ఏం జరిగిందంటే

హైదరాబాద్, అక్టోబరు 8 (టుడే విదుర)::నగరంలో వ్యక్తి కిడ్నాప్ కలకలం రేపుతోంది. వాకింగ్‌కు వెళ్తున్న ఓ వ్యక్తిని దుండగులు కిడ్నాప్ చేశారు. తుపాకీతో బెదిరించి మరీ 10 కోట్ల రూపాయలు డిమాండ్ చేశారు కిడ్నాపర్లు. బాధితుడు మనోజ్ కుమార్‌గా గుర్తించారు. అతడి భార్య ఫిర్యాదుతో రంగంలోకి దిగిన మధురానగర్ పోలీసులు.. నిందితులను ట్రాప్ చేసి అరెస్టు చేశారు.ఈ నెల 6న మనోజ్ కుమార్ అనే వ్యక్తి తన స్నేహితుడితో కలిసి మాతృశ్రీనగర్‌లో వాకింగ్‌కు వెళ్లారు. ఈ క్రమంలో మనోజ్ కుమార్‌కు వెంకటస్వరూప్ అనే వ్యక్తి తారసపడ్డాడు. మనోజ్‌కు మాయ మాటలు చెప్పి కారులో అమీర్‌పేటలో ఉన్న తన కార్యాలయానికి తీసుకువెళ్లిన వెంకటస్వరూప్. ఆపై 10 కోట్ల రూపాయలు ఇవ్వాలంటూ వెంకట స్వరూప్‌తో పాటు మరో ఐదుగురు మనోజ్ కుమార్‌పై దాడికి పాల్పడ్డారు. అంతేకాకుండా మనోజ్ కుమార్ భార్యకు ఫోన్ చేసి డబ్బు చెల్లించకపోతే చంపేస్తామంటూ బెదిరింపులకు దిగారు.దీంతో భయాందోళనకు గురైన మనోజ్ కుమార్ భార్య వెంటనే పోలీసులను ఆశ్రయించారు. కేసు నమోదు చేసిన పోలీసులు దుండగుల కోసం విస్తృతంగా గాలించారు. చివరకు వారిని ట్రాప్ చేసి నిందితుల్లో ముగ్గురిని




అమీర్‌పేట్‌లో అరెస్ట్ చేశారు పోలీసులు. పరారీలో ఉన్న మరో ఇద్దరు కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. మొత్తానికి కిడ్నాప్‌కు గురైన వ్యక్తి సురక్షితంగా బయటపడటంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు.



# జైళ్లల్లో నిఘా లోపం!

హైదరాబాద్, అక్టోబరు 8 (టుడే విదుర):కరుడుగట్టిన నేరగాళ్లు, సంఘ విద్రోహులు రిమాండ్ ఖైదీలుగా ఉండే జైళ్లలో నిఘా వ్యవస పటిష్ఠంగా ఉండాలి. నేరస్థుల ప్రతి కదలికను గమనించేలా భద్రతా ఏర్పాట్లు ఉండాలి. కానీ రాష్ట్ర జైళ్లల్లో మాత్రం ఆ పరిస్థితి కనిపించడం లేదు. నిఘాలోపాన్ని ఆసరాగా చేసుకుని ఖైదీలు జైళ్ల నుంచి తప్పించుకుని పారిపోవడం, పారిపోయేందుకు ప్రయత్నాలు చేస్తున్న ఘటనలు వెలుగుచూస్తున్నాయి. ఇటీవల చర్లపల్లి కేంద్ర కారాగారం నుంచి ఓ ఖైదీ పట్టపగలు జైలు సిబ్బంది కళ్లుగప్పి జైలు గోడ దూకి తప్పించుకుని పారిపోయాడు. జైలుకు వచ్చిన కేవలం రోజుల వ్యవధిలోనే భద్రతా లోపాలు, లోటుపాట్లు గుర్తించిన ఖైదీ పరిస్థితులు అనుకూలంగా మార్చుకుని తప్పించుకున్నాడు. ఖైదీ పారిపోయిన విషయం తీరిగ్గా గుర్తించిన జైలు అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పారిపోయిన ఖైదీని వెతికి పట్టుకొచ్చారు. ఈ ఘటన జరిగిన రోజుల వ్యవధిలోనే అదే జైల్లో మరో ఖైదీ కనిపించకుండా పోవడం జైలు అధికారుల్ని ఉరుకులు పరుగులు పెట్టించింది. అయితే జైలు ఆవరణ మొత్తం వెతికే క్రమంలో నిరుపయోగంగా ఉన్న ఓ భవనంలో ఖైదీ తీరిగ్గా పడుకుని ఉండటం గుర్తించి అంతా ఊపిరి పీల్చుకున్నారు. చర్లపల్లి కేంద్ర కారాగారంలో ఇలాంటి వరుస ఘటనలు కేవలం అక్కడి భద్రతనే కాదు.. రాష్ట్ర జైళ్ల శాఖ పనితీరు కూడా ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. కాగా నిఘా లోపా న్ని ఆసరాగా చేసుకుని ఖైదీలు తప్పించుకుని పారిపోవడం కొత్తేమీ కాదు. గతంలో కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని సబ్ జైలు నుంచి రాజేశ్ అనే ఖైదీ తప్పించుకుని పారిపోయాడు. అత్యాచారం కేసులో నిందితుడిగా ఉన్న రాజేశ్ జైలు ఆవరణలో పనిచేస్తున్న సమయంలో జైలు సిబ్బంది కళ్లుగప్పి తప్పించుకునిపారిపోయాడు. మరో ఘటనలో వరంగల్ జిల్లాలోని పరకాల సబ్ జైలు నుంచి పోక్సో కేసులో నిందితుడిగా ఉన్న మహమ్మద్ పాషా తప్పించుకున్నాడు. నిఘా లోపం, సిబ్బంది నిర్లక్ష్యాన్ని గుర్తించిన పాషా జైలు ఆవరణలో పరిశుభ్రత కార్యక్రమంలో పాల్గొని చెత్త బయట పడేసే నెపంతో తప్పించుకుని పారిపోయాడు.జైళ్లల్లో సీసీ కెమెరాలు కేవలం అలంకారప్రాయంగా మారాయి. చర్లపల్లి కేంద్ర కారాగారంలో సుమారు 200లకుపైగా సీసీ కెమెరాలు ఉన్నట్లు సమాచారం. ~

టుడే వినోదం



# నయన్ ఎమోషనల్...

## 22 యేళ్ళ జర్నీని తలుచుకున్న నయన్




సౌతిండియన్ లేడీ సూపర్ స్టార్ నయనతార ఎమోషనల్ అయ్యింది. సరిగ్గా 22 సంవత్సరాల క్రితం తాను తొలిసారి కెమెరా ముందు నిలుచుకున్నానని తెలిపింది. సోషల్ మీడియాలో నయనతార ఓ పోస్ట్ పెడుతూ, తన భావోద్వేగాలకు అద్దం పట్టింది. 'నేను తొలిసారి కెమెరా ముందు నిలబడి 22 సంవత్సరాలు అయ్యింది. సినిమాలను నేను జీవితంలో ఇంతగా ప్రేమిస్తానని అప్పుడు తెలియదు. ప్రతి షాట్, ప్రతి ఫ్రేమ్, ప్రతి నిశబ్దం... నన్ను నన్నుగా తీర్చిదిద్దాయి. నాకు స్వాంతన చేకూర్చాయి. నన్ను నన్నుగా చేశాయి... ఎప్పటికీ కృతజ్ఞతలతో...' అంటూ తన మనసులోని భావాలను నయనతార వ్యక్తపర్చింది. 2023లో విడుదలైన మలయాళ చిత్రం 'మనస్సినక్కరే' నయన్ తొలి చిత్రం. ఇందులో జయరామ్ హీరోగా నటించాడు. అయితే... రజనీకాంత్ 'చంద్రముఖి' సినిమాతో నయనతార స్టార్ హీరోయిన్ గా గుర్తింపు పొందింది. పలు భాషలలో కమర్షియల్ హీరోయిన్ గా నటిస్తూనే, లేడీ ఓరియంటెడ్ చిత్రాలకూ శ్రీకారం చుట్టింది. దక్షిణాదిన అత్యధిక పారితోషికం అందుకునే నాయికగా ఎదిగింది. దర్శకుడు విఘ్నేష్ శివన్ ను వివాహం చేసుకున్న నయన తార ఇప్పుడు ఇప్పుడు ఇద్దరు కవలల తల్లి.లేడీ సూపర్ స్టార్ గా మన్ననలు అందుకుంటున్న నయనతార 'జవాన్' మూవీతో బాలీవుడ్ లోనూ జయకేతనం ఎగరేసింది. ప్రస్తుతం తెలుగులో చిరంజీవి సరసన 'మన శంకర వరప్రసాద్ గారు' సినిమాలో నాయికగా నటిస్తోంది. అంతేకాదు... తమిళ, కన్నడ, మలయాళ భాషా చిత్రాలలో నాయికగా నటిస్తోంది. ఇదిలా ఉంటే... నయనతార, కవిన్ జంటగా నటిస్తున్న చిత్రానికి 'హాయ్' అనే టైటిల్ ను అధికారికంగా ప్రకటించారు. ఈ సినిమాకు సంబంధించిన రెండు పోస్టర్స్ ను మేకర్స్ రిలీజ్ చేశారు. కవిన్, నయన్ ఓ ఇంటి మీద కూర్చుని ఒకరిని ఒకరు చేస్తుకుంటున్న ఈ పోస్టర్ ఆసక్తిని కలిగించేలా ఉంది. ఈ రొమాంటిక్ డ్రామాతో విష్ణు ఎడవన్ దర్శకుడిగా పరిచయమౌతున్నాడు.

# శిల్పాశెట్టి దంపతులకు కోర్టులో చుక్కెదురు




ప్రముఖ నటి శిల్పాశెట్టి , ఆమె భర్త రాజ్ కుంద్రా కు మరోసారి బాంబే హైకోర్టులో చుక్కెదురైంది. గత కొన్నేళ్ళుగా రాజ్ కుంద్రా వివిధ కేసులలో కోర్టు గుమ్మం తొక్కుతూనే ఉన్నారు. వ్యాపారంలో భాగస్వాములను మోసం చేసిన కేసులోనూ, పోర్న్ వెబ్ సైట్స్ ను నిర్వహించిన కేసులోనూ ఆయన నిందితుడుగా ఉన్నారు. ఇదే సమయంలో ఓ వ్యాపారవేత్తను 60 కోట్ల రూపాయల మేర మోసం చేసిన కేసులో బాంబే హైకోర్ట్ శిల్పాశెట్టి దంపతుల పిటీషన్ ను తిరస్కరించింది. తమ ఇద్దరినీ విశ్రాంతి కోసం విదేశీ పర్యటనలకు అనుమతించాలని శిల్పాశెట్టి దంపతులు బాంబే హైకోర్ట్ లో పిటీషన్ వేశారు. దానిని పరిశీలించిన చీఫ్ జస్టిస్ చంద్రశేఖర్, జస్టిస్ గౌతమ్ అన్ ఖండ్ వారి పిటీషన్ ను కొట్టివేశారు. ఒకవేళ విదేశీ పర్యటనకు వెళ్ళాలని అనుకుంటే, రూ. 60 కోట్లను డిపాజిట్ చేయాలని తెలిపారు. ఈ ఆదేశాలను పాటించిన తర్వాతే తదుపరి విచారణ చేపడతామని స్పష్టం చేశారు.ఆగస్ట్ 14న దీపక్ కఠారీ అనే వ్యాపారవేత్త శిల్పాశెట్టి దంపతులపై కేసు పెట్టారు. పెట్టుబడి పేరుతో తన దగ్గర రూ. 60 కోట్లు తీసుకుని వ్యక్తిగత అవసరాలకు వారు వాడుకున్నారని కోర్టుకెక్కాడు. దీంతో దంపతులిద్దరిపై ముంబాయి పోలీసుల ఆర్థిక నేరాల విభాగం లుకౌట్ నోటీసులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో తమ విదేశీ పర్యటనకు అనుమతి కోరుతూ వీరు కోర్టుకు వెళ్ళారు.

# 20నెలల తర్వాత.. మెగాఫోన్ పట్టిన త్రివిక్రమ్




వెంకటేశ్ కథానాయకుడిగా త్రివిక్రమ్ తెర కెక్కించనున్న చిత్రం రెగ్యులర్ షూటింగ్ బుధవారం ప్రారంభమైంది. వెంకీ 77 అనేది వర్కింగ్ టైటిల్. ఈ సందర్భంగా షూటింగ్‌లో వెంకటేశ్ , త్రివిక్రమ్ కలిసి దిగిన ఫొటోను నిర్మాత నాగవంశీ అభిమానులతో పంచుకున్నారు.'20 నెలల సుదీర్ఘ విరామం తర్వాత మాటల మాంత్రికుడు మళ్లీ మెగాఫోన్ పట్టారు. అందరికీ అభిమాన కథానాయకుడైన వెంకటేశ్‌తో చేతులు కలిపారు. ఓజీస్ ఎంటర్టైన్‌మెంట్స్ మళ్లీ పునరావృతం అవుతుంది' అని పేర్కొన్నారు.%ఈ చిత్రాన్ని ఎస్.రాధాకృష్ణ నిర్మిస్తున్నారు. ఇందులో ఇద్దరు కథానాయికలు నటించే అవకాశం ఉందని, త్రిష, రుక్మిణీ వసంత్, నిధి అగర్వాల్, శ్రీనిధి శెట్టి పేర్లు పరిశీలనలో ఉన్నాయని సమాచారం.

# బాక్సాఫీస్ వద్ద.. రిషబ్ వీర విహారం! వారంలోనే.. రూ. 500 కోట్లు




దసరా పర్వదినాన్ని పురస్కరించుకుని థియేటర్లకు వచ్చిన కాంతార చాప్టర్ 1 ప్రపంచ వ్యాప్తంగా బాక్సాఫీస్ వద్ద కలెక్షన్ల సునామీ సృష్టిస్తోంది. విడుదలైన ప్రతి చోటా మంచి పాజిటివ్ దక్కించుకుని అంతకుమించి అనే స్థాయిలో వీర విహారం చేస్తుంది.కాంతార సాధించిన విజయాన్ని దృష్టిలో పెట్టుకుని దానిని మించిన విస్తృతమైన కథ, సంగీతం, అదిరే విజువల్స్ తో ప్రేక్షకులను కట్టి పడేస్తుంది. రిషబ్ షెట్టి ఎన్నో వ్యయ ప్రయాసలను బరించి అంతా తానే అయి రూపొందించిన ఈ సినిమా ప్రతి ఫ్రేమ్‌లో ఆ కష్టం స్పష్టంగా కనిపించింది.ఇప్పుడు అందుకు తగ్గట్టుగానే థియేటర్ల వద్ద మంచి ఫలితాలు పొందుతుంది. ప్రఖ్యాత హొంబులే ఫిలింస్ (సుమారు. రూ130 కోట్ల వ్యయంతో నిర్మించిన ఈ చిత్రం వారం రోజుల్లోనే రూ450 కోట్ల గ్రాస్‌ను రాబట్టి సరికొత్త రికార్డులు నెలకొల్పింది. ప్రధాన పాత్ర దారులు రిషబ్, రుక్మిణి ( నటనకు ప్రేక్షకులు బ్రహ్మరథం పడుతున్నారు. %ప్రస్తుతం థియేటర్లలో కాంతార విజృంభణ చూస్తుంటే రూ. 1000 కోట్ల మార్క్‌ను టచ్ చేసేలా ఉందని చాలామంది నెటిజన్లు అభిప్రాయ పడుతున్నారు. ఇదిలాఉంటే.. 2022లో వచ్చిన మొదటి సినిమా కాంతార కేవలం రూ.16 కోట్లతో తెరకెక్కి వరల్డ్‌వైడ్‌గా రూ.400 కోట్లకు పైగా వసూల్లు రాబట్టి సంచలనం సృష్టించడం గమనార్హం.


# థియేటర్‌లో.. భోజనం చేస్తూ సినిమా



భారతదేశంలో ప్రముఖ మల్టీప్లెక్స్ చైన్ అయిన పీవీఆర్ ఐనాక్స్ ఇప్పుడు మరో కొత్త ప్రయత్నానికి నాంది పలికింది. ప్రేక్షకులకు అంతకుమించి అనేలా ఎక్స్‌పీరియన్స్ ను అందించడంతో పాటుకు ఆ ఫీల్‌ను మరో స్థాయికి తీసుకెళ్లేందుకు కొత్త సాంప్రదాయానికి తెర తీసింది. ఇకపై ప్రేక్షకులు థియేటర్‌లో సినిమా చూడడం మాత్రమే కాకుండా ప్రత్యేకంగా రూపొందించిన డైనింగ్ స్పేస్‌లో భోజనాన్ని కూడా ఆస్వాదించే అవకాశం కల్పిస్తూ తన మొదటి డైన్-ఇన్ సినిమా మల్టీప్లెక్స్‌ను బెంగళూరు )లో ప్రారంభించింది.%ఇక్కడ ప్రేక్షకులు సినిమా చూస్తూనే ప్రత్యేకంగా రూపొందించిన డైనింగ్ స్పేస్లో భోజనం చేసుకునే వీలుంది. గ్రూప్ బుకింగ్స్ కూడా అందుబాటులో ఉన్నాయి, అంటే కార్పోరేట్, కుటుంబం లేదా స్నేహితులతో కలిసి గెట్ టూ గెదర్ లాగా మీటింగ్స్ నిర్వహించుకుంటూ ఈ ప్రత్యేక డైన్-ఇన్ అనుభవం పొందవచ్చు. అయితే.. ప్రేక్షకులు నిర్వహించాలని అనుకున్న ఈవెంట్, కంటెంట్ థీమ్ ఆధారంగా పీవీఆర్ రెండు రకాల ధరలు నిర్ణయించింది. ప్రస్తుతం రెండు సీటర్ల టేబుల్‌కు రూ.490, నాలుగు సీటర్లకు రూ.990గా ధరలు నిర్ణయించారు.%అయితే.. ప్రస్తుతం బెంగళూరులో ప్రారంభించిన ఈ తరహా మల్టీప్లెక్సులను మరింతగా విస్తరిస్తూ.. 2027 నాటికి కొత్తగా 5 మల్టీప్లెక్సులను అందుబాటులోకి తేనున్నట్లు యాజమాన్యం ప్రకటించింది. అయితే.. పీవీఆర్ ఐనాక్స్ %ఖీ%24 వార్షిక నివేదిక ప్రకారం కేవలం ఫుడ్ ద్వారా వచ్చే ఆదాయం 21% వృద్ధి చెందగా మొత్తం రూ.1,958.40 కోట్లు గడించడం గమనార్హం. కాగా టికెట్ల ద్వారా వచ్చే ఇన్‌కం కన్నా ఫుడ్ వ్యాపారం ఇప్పుడు ఈ సంస్థకు ప్రధాన ఆదాయ వనరుగా మారిందని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు.%ఇదిలాఉంటే.. మన హైదరాబాద్‌లోని గచ్చీబౌలి మహేశ్‌బాబు %ూవీదీజఱఅవమ్ఖం% మల్టీప్లెక్సులో డైనింగ్‌కు ప్రత్యేక ఏర్పాట్లు లేకున్నా ఇప్పటికే బిర్యానీని అందుబాటులోకి తీసుకువచ్చారు. ఇంట్రెస్ట్ ఉన్నవారు కొనుగోలు చేసి, ఆర్డర్ చేసి తినవచ్చు. కానీ ఆకాశాన్నంటే రేట్లు, అందుకు భిన్నంగా క్వాంటిటీ ఉండడంతో సామాన్యుడు అటు వైపు చూసే పరిస్థితి ఏ కోశాన లేకుండా పోయింది.కేవలం డబ్బున ఉన్న వారు మాత్రమే ప్రస్తుతం ఆ ఫెసిలిటీని ఆస్వాదిస్తున్నారు.%అయితే కొందరు క్రమంగా భోజనాన్ని కూడా థియేటర్లకు పట్టుకొచ్చారు.. మరి మందు మాత్రమే బ్యాలెన్స్ ఉంది. దానిని కూడా తీసుకురండి అది మాత్రం ఏ తప్పు చేసిందంటూ సెటైరికల్‌గా కామెంట్లు చేస్తున్నారు. ఏమో భవిష్యత్తులో ఆ రోజు కూడా వస్తుందేమో వెయిట్ చేద్దాం అంటూ పలువురు ఆశావాదులు ట్వీట్లు వేస్తున్నారు.



# క్రీడావార్తలు



## టెస్టు ర్యాంకింగ్స్.. సిరాజ్, జడేజాకు కెరీర్‌లో అత్యుత్తమం



భారత క్రికెటర్లు మహ్మద్ సిరాజ్, రవీంద్ర జడేజా తమ కెరీర్‌లో అత్యుత్తమ టెస్టు రేటింగ్ పాయింట్లు సాధించారు. వెస్టిండీస్‌తో జరిగిన తొలి టెస్టులో అదరగొట్టిన వీరిద్దరూ బుధవారం ఐసీసీ ప్రకటించిన ర్యాంకింగ్స్‌లో గణనీయంగా స్థానాలను మెరుగుపర్చుకున్నారు. విండీస్‌తో మొదటి టెస్టులో రెండు ఇన్నింగ్స్‌ల్లో కలిపి ఏడు వికెట్లు పడగొట్టిన సిరాజ్ (718 పాయింట్లు) మూడు స్థానాలు ఎగబాకి 12వ స్థానానికి చేరుకున్నాడు. జస్‌ప్రీత్ బుమ్రా అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. స్పిన్నర్ కుల్‌దీప్ యాదవ్ ఏడు స్థానాలు ఎగబాకి 21 ర్యాంకులో నిలిచాడు.

సీనియర్ ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా (644 పాయింట్లు) బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో కెరీర్‌లో ఉత్తమ రేటింగ్ పాయింట్లు అందుకున్నాడు. జడ్డూ ఆరు స్థానాలు మెరుగై 25వ స్థానానికి చేరుకున్నాడు. అలాగే కేఎల్ రాహుల్ 35 స్థానానికి చేరుకున్నాడు. ఈ విభాగంలో ఇంగ్లాండ్ ఆటగాడు జో రూట్ నంబర్ వన్ ర్యాంక్‌లో కొనసాగుతుండగా.. యశస్వి జైస్వాల్ రెండు స్థానాలు దిగజారి ఏడో ర్యాంక్‌కు పడిపోగా.. రిషభ్ పంత్, శుభ్‌మన్ గిల్ వరుసగా 8, 13 స్థానాల్లో ఉన్నారు. ఆల్‌రౌండర్ల విభాగంలో జడేజా టాప్‌లో ఉండగా. వాషింగ్టన్ సుందర్ నాలుగు స్థానాలు మెరుగై 11 స్థానంలో నిలిచాడు.

## ఆ విజయం గంభీర్ ది కాదు: రోహిత్



%ముంబై, అక్టోబర్ 08: ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ 2025 గెలుపు క్రెడిట్ ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్‌ది కాదని టీమిండియా మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ పరోక్షంగా వెల్లడించాడు. మాజీ హెడ్ కోచ్ రాహుల్ ద్రవిడ్‌తో కలిసి తాను నిర్మించిన టీమ్ తోనే ఛాంపియన్స్ ట్రోఫీ, టీ20 ప్రపంచకప్ 2024 విజయాలు సాధ్యమయ్యాయని హిట్ మ్యాన్ స్పష్టం చేశాడు. వన్డే ప్రపంచకప్ 2023 ఫైనల్ ఓటమి అనంతరవే భిన్నంగా ప్రయత్నించాలని నిర్ణయించుకున్నామని రోహిత్ తెలిపాడు.

టీ20, టెస్ట్ ఫార్మాట్లకు వీడ్కోలు పలికిన రోహిత్ శర్మ కేవలం వన్డే ఫార్మాట్‌లోనే కొనసాగుతున్న విషయం తెలిసిందే. అక్టోబర్ 19 నుంచి ప్రారంభమయ్యే ఆస్ట్రేలియా టూర్ తో రోహిత్ టీమిండియాలోకి రీఎంట్రీ ఇవ్వనున్నాడు. అయితే ఈ పర్యటనలో అతడు కేవలం ఆటగాడిగా మాత్రమే కొనసాగనున్నాడు. వన్డే కెప్టెన్సీ బాధ్యతల నుంచి రోహిత్ శర్మను తప్పించిన సెలెక్టర్లు.. యంగ్ ప్లేయర్ శుభ్‌మన్ గిల్‌ను నయా సారథిగా ఎంపిక చేసిన సంగతి తెలిసిందే.

## కొత్త కారు కొన్న 'హిట్ మ్యాన్'.. నంబర్ ప్లేట్ సో స్పెషల్




టీమిండియా స్టార్ బ్యాట్స్‌మెన్, హిట్ మ్యాన్ రోహిత్ శర్మ గురించి తెలియని వారుండరు. క్రికెట్‌లో అద్భుతమైన ఆటతీరును ప్రదర్శిస్తూ భారీ ఫ్యాన్ ఫాలోయింగ్‌ను మూటగట్టుకున్నారు. తాజాగా ఆయనకు సంబంధించిన ఓ వార్త నెట్టింట్లో చక్కర్లు కొడుతోంది. సాధారణంగా క్రికెటర్లు అంటేనే కొత్త కార్లను కొనడానికి ఇష్టపడుతున్నారు. ఉత్సాహంగా లాంగ్ ట్రిప్ వేసుకొని మైండ్‌ని రిఫ్రెష్ చేసుకొని, పోటీకి సిద్ధం అవుతుంటారు. హిట్ మ్యాన్ రోహిత్ శర్మ కూడా తాజాగా మరో కొత్త కారు కొన్నారు. టెస్లా మోడల్ కారుని ఆయన కొనుగోలు చేశారు. ఈ కారుతో ఉన్న హిట్ మ్యాన్ వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.అయితే ఈ కారు నంబర్‌కు కూడా ఓ ప్రత్యేకత ఉంది. ఆయన తన కుమార్తె, కొడుకు పుట్టిన తేదీల ఆధారంగా కారు నంబర్‌ను తీసుకున్నారు. రోహిత్ శర్మ తన కొత్త టెస్లా మోడల్ వై కారుకు '3015' అనే ప్రత్యేక నంబర్ ప్లేట్ తీసుకున్నారు. 30 నంబర్ కుమార్తె సమైరా పుట్టిన రోజు (30 డిసెంబర్) కాగా..15 నంబర్ కొడుకు అహాన్ పుట్టిన రోజు (15 ఫిబ్రవరి). టెస్లామోడల్ వై కారు టెస్లా ఇండియాకు చెందిన స్టాండర్డ్ వేరియంట్ కారు.%రోహిత్ శర్మ కారు గురించి అభిమానులు తెగ సెర్చ్ చేస్తున్నారు. టెస్లా మోడల్ వై కారు.. 15.4- ఇంచ్ టచ్‌స్క్రీన్ డిస్‌ప్లేతో తయారు చేయబడింది. హీటెడ్ %ఐ% వెంటిలేటెడ్ సీట్లతో దీనిని రూపొందించారు. యాంబియంట్ లైటింగ్, 9 స్పీకర్ల ఆడియో సిస్టమ్‌ని ఈ కారులో ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. ఆటోమేటిక్ ఎమర్జెన్సీ బ్రేకింగ్ సిస్టమ్‌ను ఈ కారులో ఏర్పాటు చేశారు. బ్లైండ్ స్పాట్ కొలిజన్ వార్నింగ్, టింటెడ్ గ్లాస్ రూఫ్ ఫీచర్లు డ్రైవింగ్ అనుభవాన్ని మరింత సౌకర్యవంతంగా, లగ్జరీ అనుభవాన్ని ఇస్తాయి. ఈ కారుకి వినూత్న బ్యాటరీ రేంజ్ ఇవ్వబడింది. స్టాండర్డ్ రేంజ్ వేరియంట్‌కు ఒకసారి ఛార్జింగ్ పెడితే సుమారు 500 కిలోమీటర్లు, లాంగ్ రేంజ్‌కు సుమారు 622 కిలోమీటర్లు వస్తుంది. మాడల్ వై స్టాండర్డ్ %=ఔణ% కారు ధర రూ.59.89 లక్షలు కాగా.. మాడల్ వై లాంగ్ రేంజ్ %=ఔణ% కారు ధర రూ.67.89 లక్షలుగా నిర్ణయించారు.

## మరో వివాదంలో పృథ్వీషా



ముంబయి: టీమ్‌ఇండియాకు దూరమైన బ్యాటర్ పృథ్వీ షా మరో వివాదంలో చిక్కుకున్నాడు. మహారాష్ట్ర తరఫున బుచ్చిబాబు ఇన్విటేషనల్ టోర్నమెంట్లో రంజీ వార్మప్ మ్యాచ్‌లో సహచర ఆటగాడు ముషీర్‌ను కొట్టబోయాడు. మైదానంలోని ఆటగాళ్లు, అంపైర్లు జోక్యం చేసుకోవాల్సివచ్చింది. వాళ్లు పృథ్వీని దూరంగా తీసుకెళ్లారు. తన అసంతృప్తి వ్యక్తం చేస్తూనే మైదానం వీడాడు. ఈ వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

కాగా ఈ మ్యాచ్‌లో పృథ్వీ షా చెలరేగి ఆడాడు. 181 పరుగులు చేశాడు. మరో ఓపెనర్ అర్షిన్ కులకర్ణితో కలిసి అతడు తొలి వికెట్‌కు 305 పరుగులు జోడించాడు. డబుల్ సెంచరీకి చేరువగా వచ్చిన పృథ్వీని ముషీర్ ఔట్ చేసి అతడికి 'థాంక్యూ' అంటూ వీడ్కోలు ఇచ్చాడు. డబుల్ సెంచరీకి చేరువగా వచ్చి ఔట్ కావడంతో ఆగ్రహించి గొడవకు దిగాడు.

## తరుణ్ సూపర్



వన్తా (ఫిన్లాండ్): తెలుగు షట్లర్ తరుణ్ మన్నేపల్లి ఆర్కిటిక్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో శుభారంభం చేశాడు. ప్రపంచ 14వ ర్యాంకరైన టోమా జూనియర్ పొపోవ్ (ఫ్రాన్స్)కు షాకిచ్చి రెండో రౌండ్‌కు దూసుకెళ్లాడు. బుధవారం జరిగిన తొలి రౌండ్లో 46వ ర్యాంకర్ తరుణ్ 11-21, 21-11, 22-20తో పొపోవ్‌ను కంగుతినిపించాడు. లక్ష్య సేన్ 15-21, 17-21తో ఐదోసీడ్ కొడాయి నరకొర (జపాన్) చేతిలో ఓటమిపాలయ్యాడు. ఓ టోర్నీలో ఆరంభ రౌండ్లోనే ఓడడం లక్ష్యకు ఈ ఏడాదిలో ఇది పదోసారి. కిడాంబి శ్రీకాంత్ ఆరంభ మ్యాచ్ ఆడకుండానే ప్రత్యర్థికి వాకోవర్ ఇవ్వగా.. కిరణ్ జార్జ్ 10-21, 1-4తో ప్రత్యర్థిపై వెనుకంజలో ఉన్న దశలో గాయంతో మ్యాచ్ నుంచి వైదొలిగాడు. ఇక, శంకర్ ముత్తుస్వామి, ఆయుష్ షెట్టి ప్రత్యర్థుల చేతిలో ఓడి ఇంటిబాట పట్టారు.

## భారత క్రికెట్‌లో గంభీర్ దుమారం!



ఆస్ట్రేలియాలో జరిగే పర్యటనకు భారత వన్డే జట్టు కెప్టెన్‌గా రోహిత్ శర్మను తొలగించడం..దేశ క్రికెట్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. మరోవైపు టీ20లకు, టెస్ట్‌లకు ఇప్పటికే వీడ్కోలు పలికిన టీమిండియా దిగ్గజ ద్వయం రోహిత్-కోహ్లీని వన్డేల నుంచి తప్పించాలన్న కుట్ర జరుగుతోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ క్రమంలోనే రోహిత్‌ను వన్డే జట్టు సారథ్య బాధ్యతల నుంచి తొలగించారనేది కొందరి వాదన. రెండు ఫార్మాట్లనుంచి రోహిత్, కోహ్లీ తప్పుకొనేలా చేయడంతోపాటు మిగిలిన వన్డేల నుంచీ వారు వైదొలగేలా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ కుట్ర పన్నుతున్నాడని రో-కో అభిమానులు దుయ్యబడుతున్నారు. అలాగే ఈ ఇద్దరు గొప్ప క్రికెటర్ల కెరీర్‌లకు పొమ్మనలేక పొగబెడుతున్నాడని గంభీర్‌పై మాజీ ఆటగాడు మనోజ్ తివారీ ధ్వజమెత్తడం కీలక తాజా పరిణామం. మరోవైపు ముంబైలో జరిగిన సియెట్ క్రికెట్ అవార్డుల కార్యక్రమంలో రోహిత్ శర్మ చేసిన వ్యాఖ్యలు కూడా చర్చకు దారి తీశాయి. ఛాంపియన్స్ ట్రోఫీలో భారత జట్టు టైటిల్ గెలిచేందుకు గత కోచ్ రాహుల్ ద్రవిడ్ ముందుచూపు, అతడి కోచింగ్ నైపుణ్యాలే కారణమని రోహిత్ స్పష్టంజేశాడు. దాంతో..టీమిండియా చాంపియన్స్ ట్రోఫీ విజేతగా నిలవడంలో గంభీర్ పాత్ర లేదని తమ స్టార్ తేల్చేశాడని రోహిత్ ఫ్యాన్స్ అంటున్నారు.మాజీ ఆటగాడు మనోజ్ తివారీ చేసిన వ్యాఖ్యలు కూడా సంచలనం సృష్టించాయి. 'గంభీర్ కోచ్ అయ్యాకనే ఆస్ట్రేలియా పర్యటనలో ఉన్న అశ్విన్ అర్థంతరంగా కెరీర్‌కు వీడ్కోలు పలికాడు. రోహిత్, కోహ్లీ సుదీర్ఘ ఫార్మాట్‌నుంచి రిటైర్ అయ్యారు. రోహిత్, కోహ్లీ, అశ్విన్‌లకు ప్రస్తుత కోచ్ కంటే చాలా పేరు ప్రఖ్యాతులున్నాయి. జట్టుకు నచ్చని విషయాలను సీనియర్లు వ్యతిరేకిస్తారనే ఉద్దేశంతోనే వారు జట్టులో లేకుండా కోచ్ చూసుకుంటున్నాడు.

## టాపార్డర్ మెరవాలి..



వన్డే వరల్డ్‌కప్‌లో వరుసగా రెండు మ్యాచ్‌లు గెలిచిన భారత మహిళల జట్టుకు ఇక అసలు సిసలు సవాళు ఎదురు కానున్నాయి. గురువారం బలమైన దక్షిణాఫ్రికాతో భారత్ తలపడనుంది. తొలి రెండు మ్యాచ్‌ల్లో శ్రీలంక, పాకిస్థాన్‌పై హర్మన్ సేన నెగ్గినా.. బ్యాటింగ్‌లో తడబాటు కనిపించింది. మెరుగ్గా ఆరంభించినా ఒక్కసారిగా కుప్పకూలుతున్నారు. ముఖ్యంగా టాపార్డర్ వైఫల్యం కలవరపెడుతోంది. మెగా టోర్నీకి ముందు పరుగుల వరద పారించిన ఓపెనర్ స్మృతి మంధాన రెండు మ్యాచ్‌ల్లో 8, 23 పరుగులే చేయడం ఆందోళన కలిగిస్తోంది. స్పిన్‌ను ఎదుర్కోవడంలో ప్రతీకా రావల్ బలహీనతను పసిగట్టిన ప్రత్యర్థులు.. పవర్‌ప్లేలో ఆమెను కట్టడి చేసేందుకు స్పిన్నర్లను బరిలోకి దించుతున్నారు. వన్‌డౌన్‌లో హర్లీన్ డియోల్ స్ట్రయిక్ రేట్ కూడా ఘోరంగా ఉంది. క్రీజులో కుదురుకోవడానికి ఎక్కువ బంతులు తింటున్నదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. బ్యాటింగ్‌కు వెన్నెముక అయిన కెప్టెన్ హర్మన్ కూడా భారీ స్కోర్లు చేయలేక పోతుండడంతో ఆ భారం లోయరార్డర్‌పై పడుతోంది. గత మ్యాచ్‌ల్లో దీప్తి, రిచా, అమన్‌జోత్, రాణా ఆదుకోవడంతో పరువు దక్కింది. కాగా, పాక్‌తో మ్యాచ్‌లో అనారోగ్యంతో పేస్ ఆల్‌రౌండర్ అమన్‌జోత్ దూరం కావడంతో తుది జట్టులో చోటు దక్కించుకొన్న ఫాస్ట్ బౌలర్ రేణుక మెరుగైన గణాంకాలనే నమోదు చేసింది. అయితే, అమన్‌జోత్ ఫిట్‌నెస్‌పై ఇంతవరకు ఎటువంటి సమాచారం లేదు. దీప్తి, శ్రీచరణి, స్నేహ్ రాణాలతో స్పిన్ విభాగం బలంగా కనిపిస్తోంది. మరోవైపు న్యూజిలాండ్‌పై ఆరు వికెట్లతో నెగ్గిన సౌతాఫ్రికా ఫుల్‌జోష్‌లో ఉంది. తన్జిమ్ బ్రిట్స్, సునె లుస్ చక్కని ఫామ్‌లో ఉన్నారు. కెప్టెన్ లారా వొల్వార్డ్, మరిజానె ఖాప్, బోష్ కూడా చెలరేగితే ప్రత్యర్థికి కష్టాలు తప్పవు. అయోబొంగా కకా, కాప్, ట్రయన్ లాంటి అనుభవజ్ఞులైన బౌలర్ల నుంచి భారత బ్యాటర్లకు కఠిన పరీక్ష ఎదురుకానుంది. పిచ్ బ్యాటింగ్‌కు అనుకూలం కావడంతో భారీ స్కోర్లు నమోదు కావచ్చు.

# బిజినెస్



## పసిడికి పగ్గాల్లేవ్.. బంగారం, వెండి ధరలు ఎలా ఉన్నాయంటే..




బంగారం ధర రోజూ పెరుగుతూ సరికొత్త రికార్డులను నమోదు చేస్తోంది. భౌగోళిక రాజకీయ అనిశ్చితుల నేపథ్యంలో పెట్టుబడిదారులు సురక్షిత ఆస్తుల వైపు మొగ్గు చూపుతుండడంతో బంగారానికి డిమాండ్ పెరుగుతోంది . డాలర్‌తో పోల్చుకుంటే రూపాయి క్షీణిస్తుండడం కూడా బంగారం పెరుగుదలకు కారణంగా కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో ఈ రోజు (అక్టోబర్ 8న) 24 క్యారెట్ల పది గ్రాముల బంగారం ధర 1, 23, 940కి చేరింది. 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. రూ. 1, 13, 610కి చేరింది ఢిల్లీలో 24 క్యారెట్ల పసిడి రేటు 10 గ్రాములకు రూ. 1, 24, 090కి చేరుకోగా, 22 క్యారెట్ల గోల్డ్ ధర 10 గ్రాములకు రూ. 1, 13, 760కి చేరుకుంది. ఇక హైదరాబాద్, విజయవాడలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 1, 23, 940కి చేరుకోగా, 22 క్యారెట్ల 10 గ్రాముల గోల్డ్ రేటు రూ. 1, 13, 610కి చేరింది . వెండి ధరలు నిన్నటితో పోల్చుకుంటే వంద రూపాయిల మేర పెరిగాయి. ఈ క్రమంలో దేశంలోని ప్రధాన నగరాల్లో ఉన్న బంగారం, వెండి రేట్లను ఇప్పుడు తెలుసుకుందాం

## ఒడిదుడుకుల్లో సూచీలు.. ఈ రోజు టాప్ ఫైవ్ స్టాక్స్ ఇవే..




బుధవారం నష్టాలను చవిచూసిన దేశీయ సూచీలు గురువారం లాభాలతో ప్రారంభమయ్యాయి. ఫైనాన్సియల్ రంగంలో అమ్మకాలు సూచీలకు నెగిటివ్‌గా మారాయి. దీంతో సూచీలు లాభనష్టాలతో దోబూచులాడుతున్నాయి. ఒక దశలో 82 వేల మార్క్ దాటిన సెన్సెక్స్ మళ్లీ కిందకు దిగి వచ్చింది. దీంతో ప్రస్తుతం సెన్సెక్స్, నిఫ్టీ స్వల్ప లాభాల్లో కదలాడుతున్నాయి. బుధవారం ముగింపు (81, 773)తో పోల్చుకుంటే గురువారం ఉదయం దాదాపు 130 పాయింట్ల లాభంతో మొదలైన సెన్సెక్స్ ఆ తర్వాత మరో వంద పాయిట్లు ఆర్జించి 82 వేల మార్క్‌ను దాటింది. అయితే కాసేపటికే ఆరంభ లాభాలు ఆవిరయ్యాయి. ప్రస్తుతం ఉదయం 10:30 గంటల సమయంలో సెన్సెక్స్ 55 పాయింట్ల లాభంతో 81, 829 వద్ద కొనసాగుతోంది. మరో వైపు నిఫ్టీ కూడా సెన్సెక్స్ బాటలోనే సాగుతోంది. ప్రస్తుతానికి 37 పాయింట్ల లాభంతో 25, 083 వద్ద కొనసాగుతోంది %సెన్సెక్స్‌లో పీజీ ఎలక్ట్రోప్లాస్ట్, అరబిందో ఫార్మా, లూపిన్, ప్రెస్టేజ్ ఎస్టేట్, టాటా స్టీల్ మొదలైన షేర్లు లాభాల్లో ఉన్నాయి . ఇన్ఫోఎడ్జ్, యూనో మిండా, పీబీ ఫిన్‌టెక్, రైల్ వికాస్, అశోక్ లేలాండ్ మొదలైన షేర్లు నష్టాల బాటలో కొనసాగుతున్నాయి. నిఫ్టీ మిడ్ క్యాప్ ఇండెక్స్ 327 పాయింట్ల లాభంతో ఉంది. బ్యాంక్ నిఫ్టీ 35 పాయింట్ల నష్టంతో కొనసాగుతోంది. డాలర్‌తో పోల్చుకుంటే రూపాయి మారకం విలువ 88.78గా ఉంది.

## నాలుగు రోజుల ర్యాలీకి బ్రేక్



ముంబై: స్టాక్ మార్కెట్‌లో నాలుగు రోజుల ర్యాలీకి బుధవారం బ్రేక్ పడింది. సెన్సెక్స్ 153.09 పాయింట్ల నష్టంతో 81,77366 వద్ద ముగియగా నిఫ్టీ 62.15పాయింట్ల నష్టంతో 25,046.15 వద్ద ముగిశాయి. ఆర్ఐఎల్, హెచ్‌డీఎఫసీ బ్యాంకు వంటి బ్లూచిప్ కంపెనీలు, ఆటో, రియల్ ఎస్టేట్, బ్యాంకింగ్ షేర్లలో లాభాల స్వీకరణ అమ్మకాలు బుధవారం సూచీలను కిందికి లాగాయి. క్యూ2లో కంపెనీల ఆర్థిక ఫలితాలపై అనుమానాలు కూడా ఇందుకు దోహదం చేసినట్టు జియోజిత్ ఇన్వెస్టమెంట్స్ లిమిటెడ్ కంపెనీ రీసెర్చ్ హెడ్ వినోద్ నాయర్ చెప్పారు.

## రూ.౯౦౦ కోట్లతో జాతీయ శాట్‌కామ్ పర్యవేక్షణ కేంద్రం



న్యూఢిల్లీ: దేశంలోని డేటా వనరులు, స్పెక్ట్రమ్ ఆస్తులను పరిరక్షించేందుకు దాదాపు రూ.900 కోట్లతో జాతీయ శాట్‌కామ్ పర్యవేక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు కేంద్ర టెలికం మంత్రి జ్యోతిరాదిత్య సింధియా బుధవారం వెల్లడించారు. ఇండియన్ మొబైల్ కాంగ్రెస్ (ఐఎంసీ) సదస్సులో శాటిలైట్ కమ్యూనికేషన్స్ అంశంపై జరిగిన సెషన్‌లో మాట్లాడుతూ టెలికం, బ్రాడ్‌కాస్టింగ్‌తో కూడిన దేశీయ శాట్‌కామ్ మార్కెట్ గత ఏడాది 430 కోట్ల డాలర్ల స్థాయికి చేరుకుందన్నారు. 2033 నాటికి దాదాపు 1,500 కోట్ల డాలర్ల స్థాయికి పెరగవచ్చన్నారు. దేశంలో శాటిలైట్ ద్వారా వేగవంతమైన బ్రాడ్‌బ్యాండ్ సేవలందించేందుకు కేంద్ర ప్రభుత్వం ఇప్పటివరకు ప్రైవేట్ రంగంలోని మూడు సంస్థలు యూటెల్‌శాట్ వన్‌వెబ్, ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్‌కు చెందిన స్టార్‌లింక్, జియో ఎస్‌జీఎసకు లైసెన్సు లు మంజూరు చేసింది. ఈ మూడు సంస్థలు శాట్‌కామ్ సేవలను ప్రారంభించేందుకు అవసరమైన స్పెక్ట్రమ్ కేటాయింపుల కోసం ఎదురు చూస్తున్నాయి.

వేగంగా శాట్‌కామ్ సేవల విస్తరణ

భారత టెలికం సంస్థలు ఇప్పటివరకు 4.8 లక్షల టవర్ల ఏర్పాటు ద్వారా దేశంలోని 99.9 శాతం జనాభాకు 5జీ సేవలను అందుబాటులోకి తెచ్చాయని సింధియా అన్నారు. "ఇక శాటిలైట్ కమ్యూనికేషన్ సేవల్లోకి అడుగుపెట్టబోతున్నాం. ప్రపంచంలోనే అత్యంత వేగంగా శాటిలైట్ సేవలు విస్తరించడమే కాకుండా మానవాళికి శాట్‌కామ్ అవసరాన్ని పునర్‌నిర్వచిస్తాం. ఇంతక్రితం 5జీతో ఇదే చేశాం. ప్రపంచ దేశాలన్నింటిలోకెల్లా వేగంగా 20 నెలల్లోనే 5జీ సేవలను విస్తరింపజేశాం. శాట్‌కామ్ విషయంలోనూ ఆ ఫలితాన్ని పునరావృతం చేస్తామని హామీ ఇస్తున్నా" అని మంత్రి పేర్కొన్నారు.భారత్ ఆశయాలు 5జీని దాటి 6జీ, శాట్‌కామ్‌కు విస్తరించి ఉన్నాయని సింధియా అన్నారు. 6జీ సాంకేతికతలో 10 శాతం పేటెంట్లను కలిగి ఉండాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆయన చెప్పారు. దేశంలో శాట్‌కామ్ సేవలు విశేషంగా వృద్ధి చెందనున్నాయని, 2033 నాటికి ఈ మార్కెట్ మూడింతలు కావచ్చన్నారు.భారత్‌లో శాట్‌కామ్ సేవలపై ప్రజల అంచనాలు పెరుగుతున్న తరుణంలో యూటెల్‌శాట్ వన్‌వెబ్ ద్వారా శాట్‌కామ్ సేవలను ప్రారంభించేందుకు కేంద్రం అనుమతి కోసం ఉత్సాహంగా ఎదురుచూస్తున్నాం.– సునీల్ మిట్టల్,

భారతీ ఎంటర్‌ప్రైజెస్ చైర్మన్

సెమీకండక్టర్ల నుంచి ఫ్రాడ్ మేనేజ్‌మెంట్ సొల్యూషన్స్ వరకు, త్వరలో రాబోతున్న 6జీలో భారత్ పురోగతిని ఐఎంసీలో ప్రదర్శించిన పూర్తి స్థాయి సాంకేతికతలు నొక్కి చెబుతున్నాయి. డిజిటల్ విప్లవంలో భారత్‌ను అగ్రస్థానంలో ఉంచడంతో పాటు నవ ఆవిష్కరణలకు మా కంపెనీ కట్టుబడి ఉంది.– ఆకాశ్ అంబానీ, రిలయన్స్ జియో చైర్మన్

భారతీయులకు భద్రమైన, ఆమోదనీయమైన, అత్యంత నాణ్యమైన బ్రాడ్‌బ్యాండ్ అనుభూతిని పంచేందుకు సంసిద్ధంగా ఉన్నాం.– పర్ణిల్ ఉర్ధ్వరేశే, స్టార్‌లింక్ ఇండియా ప్రతినిధిటెలికం శాఖ అభివృద్ధి చేసిన ఫ్రాడ్ రిస్క్ ఇండికేటర్ ప్లాట్‌ఫామ్ సహాయంతో ఫోన్‌పే, పేటీఎం వంటి పేమెంట్ యాప్ లు రూ.200 కోట్ల వరకు ఆర్థిక మోసాలను అరికట్టగలిగాయి.

## ఇంట్లో మూలన దొరికిన పేపర్.. ఇప్పుడు దాని విలువ దాదాపు రెండు కోట్లు



%ఇంటర్నెట్ డెస్క్: ముందు చూపున్న ఒక పెద్ద మనిషి చేసిన పని ఇప్పుడు ఆ ఇంటికి బంగారు గని దొరికినంత పనైంది. పాత కాగితాలు తీసి చూస్తుండగా ఒక కాగితం ఇంట్లో వాళ్ల కంటపడింది. అదేంటని తరచి చూస్తే, అవి షేర్ల పేపరు. ఇరవై, ముప్పై ఏళ్ల క్రితం అంతా పేపర్ల రూపంలోనే ఈ స్టాక్ మార్కెట్ షేర్ల లావాదేవీలు జరిగేవి. ఆ క్రమంలోనే సదరు పెద్దమనిషి 1995లో %జీఋశా% కంపెనీ షేరు రూ. 10 చొప్పున 100 షేర్లు కొనుగోలు చేశాడు. కొన్న షేర్లకు సంబంధించిన పేపర్లను ఇంట్లో ఎక్కడో పెట్టి మర్చిపోయాడు.దీనికోసం ఆయన పెట్టిన పెట్టుబడి అక్షరాలా వెయ్యి రూపాయలు. ఇప్పుడా షేర్ల విలువ ఏకంగా దాదాపు రెండు కోట్ల రూపాయలు అయి కూర్చొన్నాయి. వివరాల్లోకి వెళ్తే. సదరు పెద్ద మనిషి 1995 లో జిందాల్ విజయనగర స్టీల్ లిమిటెడ్ లో రూ. 10 చొప్పున 100 షేర్లు కొన్నాడు. ఈ రోజు ఆ షేర్ల విలువ రూ. 1.83 కోట్లు అయింది.వాటి విలువ ఎలా పెరిగిందన్న విషయానికొస్తే, 2005 లో జేవీఎస్ఎల్ కంపెనీ జేఎస్‌డబ్ల్యూ సంస్థలో విలీనం అయింది. అప్పుడు జేవీఎస్ఎల్ లో 1 షేరు ఉన్న వారికి 16 జేఎస్‌డబ్ల్యూ షేర్లను ఇచ్చారు. సదరు వ్యక్తి 100 షేర్లు కొన్నాడు కావున అతనికి 1600 షేర్లు వచ్చాయి.ఇక, ఆ తర్వాత జేఎస్‌డబ్ల్యూ సంస్థ 1:10 రేషియోలో స్టాక్ స్ప్లిట్ చేపట్టింది. దీంతో 1600 షేర్లు కాస్త 16000 షేర్లుగా మారాయి. ప్రస్తుతం జేఎస్‌డబ్ల్యూ (%జీూఔ%) షేరు ధర రూ. 1146 వద్ద ఉంది. ఈ విలువ ప్రకారం 16000 షేర్ల విలువ రూ. 1.83 కోట్లకు పైగా అవుతుంది.ఇది అంచనా మాత్రమే. డివిడెండ్ సైతం కలిపితే ఇంకా ఎక్కువ లాభమే వస్తుంది. ఈ వింత సంఘటనను గ్రోమాటిక్స్ మార్కెటింగ్ సంస్థ తన ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్లో పోస్ట్ చేయడంతో ఈ అద్భుతం వెలుగులోకి వచ్చింది.

## అన్ని వర్గాల అవసరాలు తీర్చాలి



ముంబై: ఫిన్‌టెక్ కంపెనీలు ఉత్పత్తుల రూపకల్పనలో సమాజంలోని దిగువ వర్గాలు, ప్రత్యేక అవసరాలు గల వ్యక్తులకు సేవలందించేందుకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా సూచించారు. సంపన్నులకు సేవలందించడం లాభదాయకమే కాని...అదే సమయంలో అన్ని వర్గాలకు అవి ఉపయోగకరంగా ఉండడం కూడా ప్రధానమేనన్నారు. ఆర్థిక అక్షరాస్యత లేని వారు, వయోవృద్ధులు, దివ్యాంగులు, చిన్న వ్యాపారుల అవసరాలను నిర్లక్ష్యం చేయరాదని సూచించారు. ప్రధానంగా చిన్న వ్యాపార సంస్థలు, అల్పాదాయ వర్గాలకు అవసరమైనంతగా రుణం అందుబాటులో ఉండేలా చూడాల్సిన బాధ్యత ఉన్నదన్న విషయం ఆయన గుర్తు చేశారు. ఫిన్‌టెక్ కంపెనీల ఉత్పత్తులు పారదర్శకంగా, ఖాతాదారుల డేటాను పరిరక్షించేలా ఉండాలని కోరారు. దేశంలో పెరిగిపోతున్న డిజిటల్ మోసాలపైనా ఆర్‌బీఐ చీఫ్ ఆందోళన వ్యక్తం చేశారు. వీటిని అరికట్టేందుకు వెంటనే చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కొత్త తరం ఫైనాన్షి యల్ మార్కెట్ సాధనంగా ఆర్‌బీఐ "యునిఫైడ్ మార్కెట్స్ ఇంటర్‌ఫేస్"ను రూపొందించినట్టు మల్హోత్రా చెప్పారు. ఇది సెంట్రల్ బ్యాంక్ డిజిటల్ కరెన్సీని (సీబీడీసీ) ఉపయోగించుకుని ఆస్తులు, సెటిల్మెంట్లు చేయగల సామర్థ్యం కలిగి ఉంటుందన్నారు. దీనికి సంబంధించిన తొలి ఫలితాలు ప్రోత్సాహకరంగా ఉన్నట్టు చెప్పారు.లిస్టెడ్ కంపెనీల కొనుగోళ్లు, విలీనాలకు అవసరమైన రుణాలు సమకూర్చేందుకు తమ బ్యాంకుకు ఎలాంటి నిధుల కొరత లేదని గ్లోబల్ ఫిన్‌టెక్ ఫెస్ట్‌లో పాల్గొన్న ఎస్‌బీఐ చైర్మన్ చల్లా శ్రీనివాసులు శెట్టి తెలిపారు. ఇటీవల ప్రకటించిన ద్వైమాసిక ద్రవ్య, పరపతి విధాన సమీక్షలో, లిస్టెడ్ కంపెనీలు వేరే కంపెనీలను కొనుగోలు చేయడం లేదా విలీనాలకు అవసరమైన నిధులు సమకూర్చేందుకు ఆర్‌బీఐ బ్యాంకులను అనుమతించింది.

TGTEL/25/A0348 TITLE: Sandhesham Times 3-82,Ananthagiri, Singavaram, SURYAPET, Telangana,508 206 Gmail : sandeshamtimes@gmail.com Website:https://sandeshamtimes.com Publisher Press (Name & Address) SUNDAY PRINTING PRESS 3-4297,SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR, ANDHRA PRADHESH-522 006